ఆంధ్రజ్యోతి





ఇటీవల తెనాలిలో రేషన్ బియ్యాన్ని నల్లబజారుకు తరలిస్తూ పోలీసులకు చిక్కిన ఎండీయూ వాహనం



విద్యుత్తు ఆదాకు.. సూర్యఘర్

- కరెంటు మిగిలితే ఆదాయం కూడా
- అవగాహన కల్పిస్తున్న విద్యుత్ శాఖ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

వినియోగదారులపై గృహ విద్యుత్తు భారం తగ్గించేందుకు కేంద్రం ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని అమలులోకి తీసుకొచ్చింది. దీని ద్వారా ఇంటి పైకప్పు నుంచే విద్యుత్తు ఉత్పత్తి చేయొచ్చు. సొంత వినియోగం తర్వాత మిగులు కరెంటు ద్వారా అదనపు ఆదాయం కూడా పొందొచ్చు. ఈ పథకాన్ని అందిపుచ్చుకుంటే ప్రతి ఇంట్లో సౌర వెలుగులు కాంతులీనుతాయి. ఇంటిలో విద్యుత్ వినియోగం 120 యూనిట్లు దాటితే సూమారు రూ.1,000 విద్యుత్తు బిల్లు వస్తోంది. అదే సోలార్ రూఫ్ టాప్ కేవలం రూ.338 మాత్రమే ఖర్చవుతుందని అధికారులు చెబుతున్నారు. ఏడాదికి రూ.8 వేలు వరకు ఆదా అవుతుంది. సూర్యఘర్ పథకంలో వంద చదరపు అడుగుల స్థలంలో 120 యూనిట్లు ఉత్పత్తి చేసే ఒక కిలోవాట్ సామర్థ్యం ఉన్న రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవచ్చు. ఇందుకు సుమారు రూ.60 వేలు ఖర్చయితే 50 శాతం, అంటే రూ.30 వేలు ప్రభుత్వం రాయితీగా ఇస్తోంది. మిగిలిన మొత్తం బ్యాంకుల నుంచి రుణంగా పొందొచ్చు.

రిజిస్ట్రేషన్ ఇలా..

గూగుల్ ప్లేస్టోర్ లోకి వెళ్లి పీఎం సూర్యఘర్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలి. యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా మొబైల్లో రిజిష్టర్ చేసుకోవాలి. ఇంటి సర్వీసు నంబ రు అనుసంధానం చేసి, రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇందుకు రూ. 1,190 చెల్లించాలి. ఆ తర్వాత విద్యుత్తు సిబ్బంది ఇంటి పై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసి, మీటర్లు అమర్చుతారు. ఒక కిలోవాట్ సోలార్ ప్యానల్స్ అమర్చుకుంటే రూ.30 వేలు ఖర్చవుతుంది. ఆ మొత్తాలు నాలుగే ళ్లలో విద్యుత్తు బిల్లు రూపేణా ఆదా అవుతుంది. అనంతరం ప్రతి యూనిట్ నుంచి ఆదాయం పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

సూర్యఘర్ పథకాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు విద్యుత్ శాఖ ఉమ్మడి జిల్లాలో విస్తృత ప్రచారం చేపట్టింది. ఇప్పటికే నెలకు రూ. 1,000 బిల్లు వచ్చే వినియోగదారులకు అవగాహన కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామ, వార్డు స్థాయి లైన్‌మెన్లు వారి చెంతకు వెళ్లి పథకం లబ్ధిని వివరిస్తున్నారు. ఒక్కో లైన్‌మెన్ కనీసం నెలకు 10 మంది వినియోగదారులనైనా చైతన్యం చేసి సోలార్ విద్యుత్తు వైపు మళ్లించేవిధంగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసే విషయమై సమగ్ర సర్వే నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వినియోగదారులకు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వం సూర్య ఘర్‌కు ఇస్తున్న రాయితీను వినియోగదారులకు తెలియజేస్తున్నారు. సోలార్ విద్యుత్తుతో కలిగే ప్రయోజనాలను చెబుతున్నారు. ఇంటి అవసరాల తర్వాత మిగిలితే విద్యుత్తును గ్రిడ్‌కు పంపించి, ఆదాయం పొందొచ్చు. దీనిపై కూడా అవగాహన కల్పిస్తున్నారు. వినియోగదారుల సందేహాలను కూడా విద్యుత్ కార్యాలయాల్లో అధికారులు నివృత్తి చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సూమారు 2,100 యూనిట్‌లు మంజూరయ్యాయి. వీటికి సంబంధించిన పనులు జరు గుతున్నాయి. సూర్యఘర్ ఏర్పాటు చేసుకున్న లబ్ధిదారులు 28మంది లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే రాయితీ సొమ్ము కూడా విడుదలైందని విద్యుత్ శాఖ ఈఈ రాంబొట్లు తెలిపారు.

సామర్థ్యం	అయ్యే ఖర్చు	రాయితీ
ఒక కిలోవాట్	రూ.60వేలు	రూ.30వేలు
రెండు కిలోవాట్	రూ.1.20లక్షలు	రూ.60వేలు
మూడు కిలోవాట్	రూ.1.80లక్షలు	రూ.78వేలు

ఎండీయూ ముసుగు.. అక్రమార్కులకదే లొసుగు

- ఇంటింటికీ బియ్యం అందించాల్సిన వాహనాలే నల్లబజార్‌కు తరలిస్తూ...
- రేషన్ మాఫియా బరితెగింపుతో ప్రభుత్వంపై మోయలేని భారం
- అక్రమార్కులకు రూ. కోట్ల ఆదాయం
- ప్రభుత్వంపై బియ్యం కొనుగోలుకు తోడు, వాహనాల ఖర్చు కూడా

పేదలకోసం ఇంటింటికీ వెళ్లి బియ్యం, రేషన్ సరకులు అందించటానికి గత వైసీపీ సర్కారు ఏర్పాటు చేసిన వాహనాలవి. కానీ అవి పేదల ఇంటికి వెళ్లకుండా బియ్యాన్ని నల్ల బజారుకు తరలిస్తే!... ఇంటింటికీ వెళ్లకుండా ఏదోఒక బజారు కూడలిలో పెట్టి ఒకరిద్దరికి అందించి, అందరికీ ఇచ్చేసినట్టు పేదల బియ్యాన్ని మాయం చేసేస్తుంటే... ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టలేడన్నట్టు అధికారులు, ప్రభుత్వంలోని రాజకీయ పెద్దలే కళ్లుమూసుకుని చూసీచూడనట్టు వదిలేస్తే... ప్రభుత్వంపై భారం, పేదలకు పస్తులు మిగులుతుంటే, అక్రమార్కులు మాత్రం రూ. కోట్లకు పడగలెత్తుతున్నారు. వారిని శిక్షించాల్సిన చట్టాలు కూడా చుట్టాలై చిన్నపాటి జరిమానాలతో సరిపెట్టేస్తుండటంతో పేదల ఆకలి తీర్చాల్సిన రేషన్ బియ్యం బహిరంగ మార్కెట్‌కు తరలిపోతోంది. దీనికోసం గ్రామాల్లో మూతపడే స్థితిలో ఉన్న రైస్ మిల్లులుకూడా తెరచుకుని రేషన్ బియ్యాన్ని పాలిష్ పట్టేస్తున్నాయి. మరికొన్ని మిల్లులు పూర్తిగా ఈ బియ్యం పాలిష్‌పట్టి, తిరిగి ప్యాకింగ్ చేసేందుకు సిద్ధమవటం గత ప్రభుత్వ కాలంలో రెచ్చిపోయిన రేషన్ మాఫియా ఇంకా విజృంభిస్తోందనటానికి ప్రస్తుతం దొరికిపోతున్న అక్రమ బియ్యం తరలింపు వాహనాలే ఉదాహరణగా నిలుస్తున్నాయి.

తెనాలి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 14.91 లక్షల తెల్ల రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులున్నారు. వీరికి ప్రతి నెలా 2.04 లక్షల క్వింటాళ్ల బియ్యాన్ని ప్రభుత్వం పూర్తి ఉచితంగా అందిస్తోంది. అయితే దీనిపై భారం మాత్రం ప్రభుత్వంపై భారీగానే పడుతోంది. కానీ అవన్నీ నిజంగా లబ్ధిదారులకే అందితే ఎంత భారమైనా లక్ష్యం నెరవేరిందని, పేదలకు ఆకలి తీర్చగలిగామని ప్రభుత్వం సరిపెట్టుకోవచ్చు. కానీ ఇక్కడ సగంపైగా బియ్యం అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లి, నల్ల బజారుకు తరలిపోతుంటే ప్రభుత్వానికి భారమే మిగులుతోంది. అటు లబ్ధిదారునికీ చిల్లర విదిలింపులు దక్కుతున్నాయి. వీరిద్దరిమధ్య అక్రమ తరలింపునకు బరితెగిస్తున్న వారు మాత్రం రూ. కోట్లకు పడగలెత్తుతున్నారు. గత ప్రభుత్వంలో అయితే సాక్షాత్తు ఎమ్మెల్యే స్థాయి నేతలే దందా వెనకుంటే, ఇప్పుడు చిన్నస్థాయి నాయకులు కక్కుర్తి పడుతున్నారు. దీంతో పేదల బియ్యం పక్కదారి పడుతున్నాయి.

ఎండీయూ వాహనాలు రేషన్ మాఫియా చేతుల్లోకి

రాష్ట్రంలోని పేదలు రేషన్ దుకాణాలకు వెళ్లి బియ్యం, ఇతర నిత్యవసరాలు తెచ్చుకోవటం కష్టమయిపోతుందంటూ గత వైసీపీ సర్కారు భారీ ఖర్చుతో ఎండీయూ(మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) వాహనాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా రేషన్ బియ్యాన్ని ఇంటింటికీ తీసుకువెళ్లి తామే అందిస్తామని గొప్పగా చెప్పింది. అంతా అది నిజమేనని సంతోషపడ్డారు. కానీ ఆ వాహనాలు ఆ వీధిలో ఏదోఒక చివర ఆపేసి సైరన్ కొడితే లబ్ధిదారులే సంచులు, రేషన్ కార్డులు చేతపట్టుకుని వాహనాల దగ్గరకు పరుగు పెట్టాల్సిన పరిస్థితి. ఆ సమయంలో ఎవరైనా ఇంటిలో లేకుంటే వారికి బియ్యం ఆ నెలకు అందనట్టే. వాహనం దగ్గరకు వచ్చిన కొద్దిమంది లబ్ధిదారులకు ఇచ్చామనిపించి మిగిలిన వాటిని నేరుగా నల్లబజార్‌కు తరలించేస్తుండటం ఇక్కడ కొసమెరుపు. సాధారణంగా రేషన్ దుకాణాలు ఇళ్ల మధ్యే ఉండటం, వాటి దగ్గరకు సరకు దింపే లా రీ లం మినహా మరే ఇతర వాహనం వచ్చినా రేషన్ సరకులు నల్లబజారుకు తరలిస్తున్నారని ఇట్టే పసిగట్టి చుట్టుపక్కలవారు అధికారులకు సమాచారం అందించే పరిస్థితి ఉండేది. ఇదంతా ఏ అడ్డంకులు లేకుండా అధికారికంగానే బియ్యాన్ని తన్నుకుపోవచ్చని ముందుచూపుతో కొనుగోలుచేశారేమో కానీ, గత ప్రభుత్వంలోని పెద్దలు అనుకున్న అక్రమ బియ్యం తరలింపులకు ఈ ఎండీయూ వాహనాలు బాగా పనికొచ్చాయి. అయితే ఇప్పుడు కూడా ఈ వాహనాలు అక్రమార్కుల చేతుల్లోనే ఉండటం విశేషం. అసలు ఈ వాహనాలు అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చక, నిరుపయోగం అనుకుంటున్న తరుణంలో కూటమి ప్రభుత్వం వచ్చాక వరుస దాడులతో ఈ వాహనాల అక్రమ వ్యాపారం ఒక్కొక్కటిగా బయటకు వస్తోంది. తాజాగా తెనాలి లోనూ రెండు వాహనాలను పోలీసులు పట్టుకున్నారు. బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అయితే వీటి ఆగడాలకు హద్దేలేదు.

ఎండీయూ వాహనాలు రద్దు చేసేనా!

రేషన్ పంపిణీలో ఎండీయూ వాహనాలు కీలకం. గత ప్రభుత్వం అనుకున్న ప్రకారం నిజంగా ఇంటింటికీ వెళ్లి తలుపుతట్టి పేదలకు బియ్యాన్ని అందించి వస్తే దీనికి మించిన మేలు మరోటి ఉండదు. కానీ గతంలో ఒకరోజు ఊరిలో లేకున్నా, మరుసటి రోజయినా రేషన్ దుకాణానికి వెళ్లి బియ్యం, ఇతర సరకులు తెచ్చుకునే అవకాశం ఉండేది. ఇప్పుడు వాహనాలు వచ్చినప్పుడు లేకుంటే రేషన్ ఆ నెల అందటం కష్టతరమే. దీనికితోడు ఇంటింటికి కాదుకదా! కనీసం ఒక వీధిలో పట్టుమని ఒక గంటకూడా నిలిపి ఉంచకుండా పదిమందికిచ్చి వెళ్లిపోతుండటం లబ్ధిదారులకు ఇబ్బందిగా మారుతున్న పరిస్థితి. ఇది లబ్ధిదారులకు ఎదురవుతున్న ఇబ్బంది అయితే, అటు ప్రభుత్వానికీ భారమే అవుతోంది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో మొత్తం 959 వరకు ఎండీయూ వాహనాలున్నాయి. వీటికి ప్రతి నెలా వాహన నిర్వహణ, వాహనదారుని ఆదాయం, నెలవారీ రుణ వాయిదా, సహాయకుని ఛార్జీల రూపంలో ప్రభుత్వం ఒక్కో వాహనానికి రూ. 21వేలు చెల్లిస్తుంది. అంటే ఈ జిల్లాల్లోని వాహనాలకే నెలకు రూ. 2.01 కోట్లుపైగా చెల్లిస్తోంది. అంటే సంవత్సరానికి రూ. 24.16 కోట్లు వెచ్చిస్తోంది. ఇవే కాకుండా ఇంత ఖర్చు చేసినా, అనుకున్న లక్ష్యం నెరవేరుతుందా అంటే అదీలేదు. పైగా ప్రభుత్వంపైనే భారం మోపేలా పేదల బియ్యాన్ని నల్ల బజారుకు తరలించేస్తుండటంతో వీటి అవసరం ఎంతవరకు ఉందనే కోణంలోనూ ప్రభుత్వం ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. అయితే వీటి వల్ల జరుగుతున్న ఉపయోగంకంటే నష్టమే ఎక్కువ ఉండటంతో అసలు వీటిని రద్దు చేస్తారనే ఆలోచనా సాగుతోంది. ప్రభుత్వం ఏవిధంగా స్పందిస్తుందోనేదానిపై ఉత్కంఠత ఉంది.



ఇటీవల తెనాలిలో పట్టుబడినఎండీయూ వాహనం

పేదలకు చిల్లర... అక్రమార్కులకు రూ. వేలకోట్లు

కిలో బియ్యం బహిరంగ మార్కెట్‌లో రూ. 45 నుంచి రూ. 55 వరకు రేటు ఉంది. మరీ సాధారణ రకం అయితే రూ. 35 నుంచి రూ. 40లోపు దొరుకుతున్నాయి. అయితే ప్రభుత్వం నాణ్యమైన బియ్యం అందిస్తుండటంతో వాటి రేటు కిలో రూ. 45 చొప్పున లెక్కకట్టినా, భారం మాత్రం భారీగానే ఉంటోంది. ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డుదారులకు పూర్తి ఉచితంగా బియ్యాన్ని అందిస్తుంటే, అసలు లబ్ధిదారులకు ఇవ్వకుండా ఎండీయూ వాహనదారులు కానీ, అక్రమార్కులు కానీ కిలో రూ. 10 నుంచి రూ. 15కు అమ్ముతున్నారు. మండలంలోని అక్రమ వ్యాపారులు వాటిని పాలిష్ పట్టించి కిలో రూ. 28 నుంచి రూ. 30 వరకు పై వ్యాపారులకు అమ్మేస్తున్నారు. కొందరు లబ్ధిదారులు ఇష్టప్రకారం బియ్యం అమ్మినా వారికి చెల్లించేది ఒక కిలోకు రూ.8 మాత్రమే. కానీ అక్రమార్కులు మాత్రం రూ. 20 నుంచి రూ. 22 వరకు అప్పనంగా దోచేస్తున్నారు. ఇక్కడ భారం ప్రభుత్వంపై పడుతుంటే, లబ్ధిదారులకూ చిల్లరే అందుతుంది. కానీ మధ్య వ్యాపారులు మాత్రం భారీగా దోచేస్తున్నారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 14.91 లక్షల రేషన్ కార్డులుంటే, వీరికోసం ప్రతి నెలా ప్రభుత్వం 2.04 లక్షల క్వింటాళ్ల బియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నారు. గతంలో డీలర్ల దగ్గర బియ్యం పక్కదారి పట్టినా వారికి అందిన కోటాలో పది నుంచి 15 శాతం మధ్య ఉండేది. ఎండీయూ వాహనాలు వచ్చాక తరలింపు తేలికవటంతో 50 నుంచి 60 శాతం బయటకు వెళ్లిపోతున్నాయి. 2.04 లక్షల క్వింటాళ్లలో కనీసం 80వేల క్వింటాళ్లే నల్లబజారుకు తరలుతున్నాయనుకుంటే, వీటిపై కిలో రూ. 8 చొప్పున లబ్ధిదారులకు అందుతున్న మొత్తం రూ. 64 కోట్లయితే, కిలో రూ. 28 రేటు చొప్పున అక్రమార్కులు అందుతున్నది మాత్రం రూ. 224 కోట్లుపైనే ఉంది. అయితే ప్రభుత్వానికి మార్కెట్ రేటుకంటే తక్కువకే అందతాయనుకుంటే, రూ. 35 చొప్పున కిలో బియ్యం విలువ లెక్కించినా రూ. 280 కోట్లపైనే భారం పడుతోంది.

ఎన్నిసార్లు పట్టుకున్నా మారని తీరు

ప్రభుత్వం పేదలకోసమని భారీగా ఖర్చు చేస్తుంటే, దానిని రేషన్ మాఫియా తమకు ఆదాయ వనరుగా మార్చుకుంది. తెనాలిలో ఇద్దరు వ్యాపారులు ఇదే వ్యాపారం కొన్ని సంవత్సరాలుగా చేస్తున్నారు. పలనాడులో ఒక్కో నియోజకవర్గంలో మాఫియా రెండు వర్గాలు విడిపోయి దందా నడుపుతున్నారు. గుంటూరు డివిజన్ పరిధిలో కూడా మాఫియా రెండువర్గాలు చీలి ఒకరినొకరు పట్టించుకోవడం గమనార్హం. వీరిని పోలీసులు, రెవెన్యూ అధికారులు అనేకసార్లు పట్టుకుని కేసులు నమోదు చేసినా, ఆహార, నిత్యావసర సరకుల చట్టం ప్రకారం పెద్దగా శిక్షలు లేవనే కారణంతో తక్కువ మొత్తంలో జరిమానాలు చెల్లించి బయటకు వచ్చేసి మళ్లీమళ్లీ అదే తరహా అక్రమ వ్యాపారానికి సిద్ధపడుతున్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక తెనాలి, వేమూరు, పొన్నూరు, రేపల్లె, బాపట్ల, పెదకూరపాడు, గుంటూరు, నరసరావుపేట, పల్నాడులోని మరికొన్ని నియోజకవర్గాల పరిధిలో కేవలం రేషన్ బియ్యం పాలిష్ పట్టేందుకే కొన్ని రైస్‌మిల్లులు పుట్టుకు రావటం విశేషం.



పంగులూరు బీసీ కాలనీలో పింఛన్‌లను పంపిణీ చేస్తున్న మంత్రి గొట్టిపాటి

పింఛన్‌ల పంపిణీలో ఏపీ ఆదర్శం

- ప్రతి హామీనీ నెరవేరుస్తాం
- మంత్రి గొట్టిపాటి

పంగులూరు, అక్టోబరు 1 : ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేరుస్తున్నామని, కూటమి ప్రభుత్వానికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండల కేంద్రమైన జె పంగులూరులో మంగళవారం మంత్రి గొట్టిపాటి పర్యటించారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పింఛన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ పింఛన్‌ల పంపిణీలో ఏపీ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నదన్నారు. ప్రతి నెలా 1వ తేదీన లబ్ధిదాయల ఇళ్లకు వెళ్లి పెన్షన ఇస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల్లో పింఛన్‌ల పంపిణీని అడ్డుపెట్టుకొని వైసీపీ నాయకులు రాజకీయ లబ్ధిపొందాలని ప్రయత్నించారని, వృద్ధులను సచివాలయాల చుట్టూ తిప్పి ప్రాణాలు తీశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక్కరోజులోనే అందరికీ పింఛన్‌లను సచివాలయ ఉద్యోగుల ద్వారా అందిస్తున్నారన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు మొదటి నెల నుంచే పెంచిన రూ.1000తో రూ.4వేల పింఛన్ ఇస్తున్నారని తెలిపారు. స్థానిక కాలనీలో సీసీ రోడ్డు సమస్యను తెలుసుకున్న మంత్రి వెంటనే రూ.30 లక్షల నిధులు మంజూరు చేయించారు. కమ్యూనిటీ హాల్స్ సీఎస్ఆర్ ఫండ్స్‌తో వెంటనే పూర్తి చేస్తామన్నారు, పీఎం కుసుమ్ పథకాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కేంద్రం సబ్సిడీని అందిస్తుందని చెప్పారు. వ్యవసాయేతర భూముల్లో సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తే 3 నుంచి 5 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చన్నారు. ఆ విద్యుత్‌ను వ్యవసాయ కనెక్షన్లకు ఉపయోగించిన అనంతరం సబ్‌స్టేషన్ ద్వారా గ్రిడ్లకు కనెక్ట్ చేసే అవకాశం ఉందన్నారు. రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుతో భవిష్యత్‌లో విద్యుత్ అవసరాలును తీర్చుకోవచ్చని మంత్రి వివరించారు. కార్యక్రమంలో చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, ప్రత్యేకాధికారి బాచిన చెంచుప్రసాద్, రావూరి రమేష్, కేవీ సుబ్బారావు, బాలిన రామసుబ్బారావు, మేడా సుబ్బారావు, జాగర్లమూడి సుబ్బారావు, కోటయ్య, నాగేశ్వరరావు, చౌదరిబాబు, శ్రీకాంత్, జగన్, నాయకులు పాల్గొన్నారు.

చేనేత సహకార సంఘాలకు.. మంచి రోజులు

- వైసీపీ హయాంలో కనిపించని పాలకవర్గాలు
- ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో కునారిల్లిన సంఘాలు
- త్వరలో ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు
- వెంటాడుతున్న అధికారులు, సిబ్బంది కొరత
- వాటిని భర్తీ చేస్తారా?

చీరాల, అక్టోబరు 1: చేనేత సహకార సంఘాలకు మళ్లీ మంచిరోజులు రానున్నాయి. వైసీపీ పాలనలో చేనేత సహకార సంఘాలు కునారిల్లాయి. స్వయం ప్రతిపత్తిని కోల్పోయాయి. దీంతో సగటు చేనేత కార్మికులు ఇబ్బంది పడ్డారు. ఈ క్రమంలో వచ్చే నెలలో చేనేత సహకార సంఘాల పాలక వర్గాలకు ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. వచ్చే నెల 20వ తేదీ నుంచి 45 రోజుల కాలవ్యవధిలో ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసేందుకు కార్యాచరణను రూపొందిస్తున్నారు. దీంతో చేనేత సహకార సంఘాలకు పూర్వ వైభవం వస్తోందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జగన్‌రెడ్డి హయాంలో చేనేత సహకార సంఘాలు ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో సాగుతున్నాయి. ఒక వైపు ప్రభుత్వ అసమర్ధ విధానాలు, మరోవైపు కరోనా కారణంగా చేనేత రంగం చితికిపోయింది. అందులో చేనేత సహకార సంఘాలు కూడా ఉన్నాయి. జిల్లాలో 8,825 మగ్గాలు ఉన్నాయి. చేనేత సహకార సంఘాలు లెక్కకు 71 ఉన్నప్పటికీ అందులో 33 మాత్రమే క్రియాశీలకంగా పనిచేస్తున్నాయి. ఇదిలావుంటే చేనేత, జౌళిశాఖ జిల్లా కార్యాలయంలో మొత్తం 22 మంది అధికారులు, సిబ్బంది ఉండాలి. ప్రస్తుతం ఏడీ ఒకరు, డీవోలు, ఏడీవోలు ఆరుగురు, మొత్తం ఏడు మంది మాత్రమే ఉన్నారు. దీంతో నేతన్నలకు పారదర్శకమైన సేవలు అందడం లేదు.

పాలక వర్గాలతో ప్రయోజనం ఉంటుందా

చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తే పాలకవర్గాలు కొలువు తీరతాయి. పాలక వర్గాలతో ప్రయోజనం ఉంటుందా అనే అంశంపై కూడా నేతన్నల్లో చర్చ సాగుతోంది. ఎందుకంటే గతంలో చేనేత సహకార సంఘాల్లో సహకారం అనేది దస్త్రాలకే పరిమితంగా ఉండేది. పాలకవర్గాలు తమకు అనుకూలమైన వారి పేర్లను మాత్రమే సంఘ సభ్యులుగా నమోదు చేసేవారు. దీంతో అర్హత ఉన్న సగటు చేనేత కార్మికులు నష్టపోయేవారు. నూతనంగా చేపట్టే చర్యల్లో క్షేత్ర స్థాయిలో చేనేత సహకార సంఘాలు క్రియాశీలకంగా పనిచేస్తూ కార్మికులకు వృత్తి భద్రత కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

నేతన్నలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి

- రాజవర్ధన్, ఏడీ హ్యాండ్లూమ్స్, చీరాల

నేతన్నలకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తున్నాం. చేనేత సహకార సంఘాల్లో ఉన్న సరుకును కూడా ఆప్కో కొనుగోలు చేస్తుంది. ఏప్రిల్ వరకు కొనుగోళ్లు జరిగాయి. తరువాత కూడా త్వరలో కొనుగోలు చేస్తారు. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తే పాలక వర్గాలతో ప్రయోజనం ఉంటుందని భావిస్తున్నాం.



పేరాల చేనేత సహకార సంఘం

117 మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

- 11న లాటరీ.. 12 నుంచి నూతన దుకాణాలు

బాపట్ల, అక్టోబరు 1: రాష్ట్రప్రభుత్వం రెండు సంవత్సరాల కాలం పరిమితితో నూతన మద్యంవిధానాన్ని ఖరారు చేసింది. దీనికి సంబంధించి బాపట్ల జిల్లాలో 117 మద్యం దుకాణాలు ఏర్పాటుచేసేందుకు కలెక్టర్ గజిట్ నోటిఫికేషన్ జారీచేశారు. బాపట్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పరిధిలోని బాపట్ల,వేమూరు, రేపల్లె, నగరం, చీరాల, అద్దంకి, పర్చూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలో మంగళవారం నుండి దరఖాస్తులు స్వీకరించేందుకు కౌంటర్‌లు ప్రారంభించారు. దరఖాస్తుదారులు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులను ఆయా స్టేషన్‌లలో సమర్పించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి దేవదత్తు తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 10వేల జనాభా ఉన్న ప్రాంతాలలో మద్యం దుకాణానికి ఏడాదికి రిటైల్ ఎక్సైజ్ పన్ను రూ.50లక్షలు, రూ.10వేల నుండి రూ.50వేల జనాభా వరకు రూ.55లక్షలు, 50వేల నుంచి 5లక్షల జనాభా వరకు రూ.65లక్షలు, 5లక్షలు పైబడిన జనాభాకు ఏడాదికి రూ.85లక్షల చొప్పున రిటైల్ ఎక్సైజ్‌పన్ను చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈనెల 9వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, 11వ తేదీ ఉదయం 11గంటలకు బాపట్లలోని ఎంఎస్ఆర్ కల్యాణమండపంలో కలెక్టర్ జే వెంకటమురళి సమక్షంలో లాటరీ తీస్తామన్నారు. లైసెన్స్‌లు దక్కించుకున్నవారు దుకాణాలు 12వ తేదీ నుంచి ప్రారంభించుకోవచ్చన్నారు. ఆయా ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌ల పరిధిలోని పట్టణ, మండలాల్లో కేటాయించిన షాపుల వివరాలిలా ఉన్నాయి. బాపట్లలో 7 దుకాణాలు, చీరాలలో 8, రేపల్లెలో 3, అద్దంకి 5, బాపట్ల మండలంలో 4, పిట్టలవానిపాలెం మండలంలో 4, కర్లపాలెం మండలంలో 4, చీరాల మండలంలో 6, రేపల్లె మండలంలో 4, భట్టిప్రోలు మండలంలో 5, నగరం మండలంలో 3, నిజాంపట్నం మండలంలో 4, చెరుకుపల్లి మండలంలో 5, వేమూరులో 3, అమర్తలూరు మండలంలో 2, చుండూరు మండలంలో 3, కొల్లూరు మండలంలో 4, చినగంజాం మండలంలో 3, కారంచేడులో2, వేటపాలెం మండలంలో 5, అద్దంకి రూరల్‌లో2, బల్లికురవ మండలంలో 4, కొరిశపాడు మండలంలో 4, సంతమాగులూరు మండలంలో 5, జె.పంగులూరు మండలంలో 3, పర్చూరు మండలంలో 4, మార్టూరు మండలంలో 6, ఇంకొల్లు మండలంలో 3, యద్దనపూడి మండలంలో 2 దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు దేవదత్తు తెలిపారు.

మట్కాకు ముహూర్తం కుదిరింది



వరుణ్‌తేజ్ హీరోగా నటిస్తున్న 'మట్కా' చిత్రం షూటింగ్ చివరి దశలో ఉంది. 1958-82 మధ్య కాలంలో జరిగే పీరియాడికల్ మూవీ ఇది. ఇందులో వరుణ్ నాలుగు విభిన్న గెటప్స్‌తో కనిపిస్తారు. ప్రస్తుతం కీలకమైన యాక్షన్ ఎపిసోడ్‌ను దర్శకుడు కరుణకుమార్ చిత్రీకరిస్తున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా శరవేగంతో జరుగుతోందనీ, నవంబర్ 14న సినిమాను విడుదల చేస్తామనీ నిర్మాతలు డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి చెప్పారు. రిలీజ్ డేట్‌ను వెల్లడిస్తూ విడుదల చేసిన పోస్టర్‌లో సిగరెట్ కాలుస్తూ మెట్లు దిగి వస్తున్న వరుణ్‌తేజ్ రెట్రో గెటప్ ఆకట్టుకుంది. ఈ చిత్రంలో నోరా ఫతేహి, మీనాక్షి చౌదరి హీరోయిన్లు.

'శ్వాగ్' ఒక వంశానికి సంబంధించిన కథ మాత్రమే కాదు పితృస్వామ్యం అనే క్లాష్ నుంచి 15వ శతాబ్దంలో మొదలయ్యే కథ కూడా. స్త్రీ, పురుషుల్లో ఎవరు గొప్ప అనే అంశంపై చర్చించే ఆసక్తికరమైన కథ. కొత్త కథలు ఎప్పుడు వచ్చినా ప్రేక్షకులు ఆదరిస్తారనే ధైర్యంతో ఈ సినిమా చేశాం' అన్నారు శ్రీవిష్ణు. ఆయన హీరోగా నటించిన 'శ్వాగ్' చిత్రం ఈ నెల నాలుగున విడుదలవుతున్న నేపథ్యంలో మీడియాకు చిత్ర విశేషాలు వెల్లడించారు.

మేకప్ కోసం నాలుగున్నర గంటలు



- నేనెప్పుడూ డ్యూయెల్ రోల్స్ వేయలేదు. కానీ ఇందులో నాలుగు పాత్రలు పోషించాను. అందరూ ఒకే పోలికలతో ఉండే ఒకే వంశస్తులు. ఎలా చేయాలన్నది సవాల్‌గా అనిపించింది. గెటప్స్ అన్నీ సెట్ అయ్యాక నమ్మకం కుదిరింది.. ఈ నాలుగు పాత్రల్లో సింగ పాత్ర కొంచెం ఈజీ అనిపించింది. మిగతా మూడూ కష్టమైనవే. రోజూ నాలుగున్నర గంటల సేపు మేకప్ చేసుకోవడం, దాన్ని తీయడానికి మరో రెండు గంటలు పట్టడం.. చాలా టఫ్. అయితే టీజర్‌కు వచ్చిన రెస్పాన్స్ చూసిన తర్వాత ఆ కష్టాన్ని మరిచిపోయా.
- చాలా పెద్ద కథ ఇది. దీన్ని రెండున్నర గంటల్లో చెప్పారా అని సినిమా చూశాక ప్రేక్షకులు దర్శకుడు హసిత్ గోలిని అభినందిస్తారు. కథలో భాగంగానే ఉండే వినోదం అందరినీ అలరిస్తుంది. నా కెరీర్‌లో వన్ ఆఫ్ ద టాప్ ఫిల్మ్‌గా నిలుస్తుందనే నమ్మకం ఉంది.
- సినిమాలో క్యారెక్టర్ బ్యాక్ స్టోరీస్ బాగా కుదిరాయి. రీతూ వర్మ పాత్రలో మంచి ట్రాన్స్‌ఫర్మేషన్ ఉంటుంది. ఈ సినిమా చూశాక మహిళల్ని ఎక్కువ అభిమానిస్తాం. గౌరవిస్తాం.
- ఒక థ్రిల్లర్ చేస్తున్నాను. అలాగే గీతా ఆర్ట్స్‌లో ఓ మంచి ఎంటర్‌టైనర్ చేస్తున్నాను.

గోవిందాకు బుల్లెట్ గాయం



ప్రమాదవశాత్తు తుపాకి పేలిన ఘటనలో బాలీవుడ్ సీనియర్ నటుడు గోవిందా గాయపడ్డారు. ఆయన కాలులోకి బుల్లెట్ దూసుకుపోయింది. కుటుంబ సభ్యులు ఆయన్ను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లడంతో వైద్యులు సర్జరీ చేసి ఆ బుల్లెట్‌ను తొలగించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందనీ, త్వరలోనే డిశ్చార్జ్ చేస్తామని వైద్యులు తెలిపారు. మంగళవారం ఉదయం ముంబై జుహూలోని గోవిందా నివాసంలో ఈ ఘటన జరిగింది. ఆయన లైసెన్స్ రివాల్వర్ చేతిలో నుంచి జారి కిందపడి హఠాత్తుగా పేలింది.


జీబ్రా అందరికీ నచ్చుతుంది



సత్యదేవ్, కన్నడ నటుడు డాలీ ధనుంజయ నటిస్తున్న 'జీబ్రా' చిత్రం టీజర్‌ను హీరో నాని విడుదల చేశారు. ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వంలో ఎస్ఎన్ రెడ్డి, పద్మజ, బాలసుందరం, దినేశ్ సుందరం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. టీజర్ విడుదల కార్యక్రమానికి అతిథిగా వచ్చిన మంచు మనోజ్ మాట్లాడుతూ 'టీజర్ అదిరిపోయింది. ఈ చిత్ర నిర్మాత ఎస్నెస్ రెడ్డి నా శ్రేయోభిలాషి. బాగా ఖర్చుపెట్టి సినిమా తీశారు. నా అభిమాన నటుడు సత్యదేవ్. ఈ సినిమా ఘన విజయం సాధించాలి' అన్నారు. హీరో సత్యదేవ్ మాట్లాడుతూ 'ఓ కొత్త క్యారెక్టర్‌తో వస్తున్నా. అన్ని పరిశ్రమల్లోని ఆర్టిస్టులు, టెక్నీషియన్లు ఇందులో ఉన్నారు. ప్రతి వ్యక్తికి ఈ సినిమా నచ్చుతుంది' అన్నారు.

రజనీకి తీవ్ర అస్వస్థత

- రక్తనాళంలో వాపు
- స్టెంట్ వేసిన వైద్య బృందం



తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ తీవ్ర అస్వస్థతతో ఆసుపత్రిలో చేరారు. సోమవారం అర్ధరాత్రి ఆయన అస్వస్థతకు గురి కావడంతో కుటుంబీకులు ఆయన్ని గ్రీమ్స్‌రోడ్డులో వున్న అపోలో ఆసుపత్రిలో చేర్పించారు. రజనీ అనారోగ్యం గురించి తెలియగానే ఆయన అభిమానులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల పూజలు నిర్వహించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా వుందని, రెండు రోజుల్లో డిశ్చార్జ్ అవుతారని మంగళవారం ఆసుపత్రివర్గాలు ప్రకటించాయి. 'గుండె నుంచి బయటకు వచ్చే ప్రధాన రక్తనాళం (బృహద్ధమని)లో వాపు వచ్చింది. దీనికి శస్త్రచికిత్స చేయకుండా ట్రాన్స్‌కాథెటర్ విధానం ద్వారా చికిత్స చేయడం జరిగింది. సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సాయి సతీష్ సారథ్యంలోని వైద్య బృందం స్టెంట్ వేసి, వాపును సరిచేశారు. ఎండోవాస్కులర్ రిపేర్ ప్రణాళికాబద్ధంగా సాగిందని ఆయన శ్రేయోభిలాషులకు, అభిమానులకు తెలియజేయాలనుకుంటున్నాం. రజనీకాంత్ ఆరోగ్యం నిలకడగా ఉంది. రెండు రోజుల్లో ఆస్పత్రి నుంచి ఇంటికి వెళతారు' అని ఆసుపత్రి వర్గాలు హెల్త్ బులిటెన్‌లో పేర్కొన్నాయి. ఇదిలా వుండగా రజనీ త్వరగా కోలుకోవాలంటూ తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి స్టాలిన్ తదితరులు ఆకాంక్షించారు. తమిళనాడు ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం స్వయంగా ఆసుపత్రికి వెళ్లి రజనీ ఆరోగ్యంపై వాకబు చేశారు. రజనీ క్షేమంగా వున్నారని, కోలుకుంటున్నారని మంత్రి ప్రకటించారు.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)

ఫిలాసఫీ అధ్యయనం విస్తృతం కావాలి


ధ్రువ పత్రాలు అందజేస్తున్న అధికారులు

పెదకాకాని, అక్టోబరు 1: నేటి ఆధునిక జీవన శైలిలో తత్వ శాస్త్రాన్ని అనుసరించేలా ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ప్రొఫెసర్ కొత్త సచ్చిదానందమూర్తి సెంటర్ ఫర్ స్టడీస్ ఇన్ ఆఫ్రో ఏషియన్ ఫిలాసఫీస్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య చల్లపల్లి స్వరూపారాణి మాట్లాడుతూ విభాగం ఆధ్వర్యంలో సిరీస్ ఆఫ్ లెక్చర్స్‌ను నిర్వహించుకునే వెసులుబాటు పరిశీలిస్తామన్నారు. ప్రొఫెసర్ నారాయణ చక్రవర్తి మాట్లాడుతూ కేవలం సదస్సుల ద్వారా తత్వశాస్త్రాన్ని బోధించలేమని తత్వశాస్త్రాన్ని కలిగి ఉండాలంటే విభిన్న రకాల బోధనా పద్ధతులను అనుసరించాలని పేర్కొన్నారు. ప్రొఫెసర్ తారీఖ్ ఇస్లామ్, ప్రొఫెసర్ అశోక్ వోహ్రా మాట్లాడుతూ తత్వ శాస్త్రాన్ని అర్థం చేసుకోవాలంటే కనీస అవగాహన ఉండాలన్నారు. కన్వీనర్ ప్రొఫెసర్ ఎం.త్రిమూర్తిరావు సదస్సు నిర్వహణకు అవకాశం కల్పించిన వీసీ ప్రొఫెసర్ గంగాధరరావు, రెక్టర్ ప్రొఫెసర్ రత్న షీలా మణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలం ఆయా కమిటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సదస్సులో పాల్గొన్న అతిథులను సన్మానించారు. పరిశోధన పత్రాలు సమర్పించిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ జార్జి విక్టర్, వర్సిటీ దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వెంకటేశ్వర్లు, దూరదర్శన్ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ జి.కొండలరావు, ప్రొఫెసర్ కె. రమేష్, ప్రొఫెసర్ సి.వెంకటాచలం, ప్రొఫెసర్ వై.అశోక్ కుమార్, ప్రొఫెసర్ సీఎస్ఎన్ రాజు, డాక్టర్ దివ్య తేజో మూర్తి, డాక్టర్ కె.సోమశేఖర్ పాల్గొన్నారు.

పెమ్మసాని కృషితో అమరావతికి టెక్నాలజీ యూనిట్

గుంటూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో రాజధాని అమరావతిలో ఎంఎస్ఎంఈ టెక్నాలజీ యూనిట్ మంజూరైయింది. పార్లమెంటు పరిధిలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులు, శంకర్ విలాస్ ఆర్‌వోబీతోపాటు పలు ఆర్‌వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణానికి కృషి చేసిన ఆయన తాజాగా అమరావతికి మరో ప్రాజెక్టును సాధించారు. టెస్టింగ్ ఫెసిలిటీస్‌తో కూడిన రూ. 250 కోట్ల విలువైన ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ను అమరావతికి మంజూరు చేయించారు. 2014లోనే ఈ టెక్నాలజీ సెంటర్‌ను అమరావతిలో ఏర్పాటు చేయాలని అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయించగా, గత వైసీపీ ప్రభుత్వం దానిని కడప జిల్లా కొప్పర్తికి తరలించింది. దీనిపై కేంద్ర మంత్రులతో చర్చలు జరిపి దాన్ని తిరిగి రాజధాని అమరావతికి తీసుకు వచ్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని కృషి చేశారు. వారి ప్రయత్నాలు ఫలించడంతో టెక్నాలజీ సెంటర్ అమరావతికి మంజూరు చేస్తూ కేంద్ర ప్రభుత్వం సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు, జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీని సమన్వయం చేసుకుంటూ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని సీఆర్‌డీఏ కమిషనర్‌కు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈ నేపథ్యంలో అమరావతి పరిధిలో 20 ఎకరాలు కేటాయించాలని ఆదేశించింది. త్వరలోనే అమరావతిలో ఈ టెక్నాలజీ సెంటర్‌కు పునాది పడబోతుంది.

మళ్లీ మిర్చి రైతులను మోసగించిన వ్యాపారులు

- కోల్డ్‌స్టోరేజ్ యాజమాన్యాలు, కమీషన్ వ్యాపారస్తులు కుమ్మక్కు
- రైతులకు బాండ్ పేపర్లు ఇచ్చి.. అదే స్టాకుపై వేరే పేర్లతో జారీ
- వాటిని బ్యాంకుల్లో ట్రైపార్టీ అగ్రిమెంట్ చేసి రూ.కోట్లలో రుణాలు
- బయట పడిన తర్వాత బోర్డు తిప్పేసి అదృశ్యం

గుంటూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మిర్చి కమీషన్, ఎక్స్‌పోర్టు, కోల్డ్‌స్టోరేజ్‌ల యజమానులు మార్కెటింగ్, ఇతర చట్టాల్లోని లోపాలను అవకాశం చేసుకుని వారిని నమ్మిన రైతులను పదేపదే మోసగిస్తున్నారు. రైతుల మిర్చిని వారికి తెలియకుండానే విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అలానే బ్యాంకు అధికారులను ఏమారుస్తూ రూ. కోట్లలో రుణాలు తీసుకుంటూ ఎగ్గొడుతున్నారు. రెండు నెలల క్రితం బేతపూడికి చెందిన అధికార పార్టీ నాయకుడు ఒకరు కోల్డ్‌స్టోరేజ్ యజమానితో చేతులు కలిపి జీడీసీసీ బ్యాంకులో ఎవరెవరివో పేర్లు పెట్టి రూ.2 కోట్లకుపైగా రుణాలు తీసుకున్న మోసం బయటపడింది. దీనిపై జీడీసీసీ బ్యాంకు కొంతమేరకు రికవరీ చేసి మిగతా మొత్తాన్ని వాయిదాల పద్ధతిలో చెల్లించేలా చర్యలు చేపట్టింది. అది మరువక ముందే ఇప్పుడు నల్లపాడు రోడ్డులోని సీతారామటౌన్‌షిప్స్ ఎదురుగా ఉన్న రాఘవేంద్ర కోల్డ్‌స్టోరేజ్‌లో మిర్చి టిక్కీలను రైతులకు తెలియకుండా విక్రయించిన ఉదంతం కలకలం రేకెత్తిస్తుంది.

నిబంధనలు.. లొసుగులు

గతేడాది మిర్చికి ధర లేకపోవడంతో వేల మంది రైతులు తమ పంటని కమీషన్ వ్యాపారస్తుల ద్వారా కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ చేసుకున్నారు. నిబంధనల ప్రకారం రైతు తీసుకొచ్చిన మిర్చి బస్తాలకు తొలుత కోల్డ్‌స్టోరేజ్ యాజమాన్యం టీఆర్ (తాత్కాలిక రసీదు)ని జారీ చేస్తుంది. ఆ తర్వాత మూడు, నాలుగు రోజుల్లోనే ఫలాన రైతు తమ స్టోరేజ్‌లో మిర్చి బస్తాలను నిల్వ చేసుకున్నారని బాండ్ పేపర్‌ని జారీ చేస్తుంది. దానిపై స్టోరేజ్ యజమాని సంతకం ఉంటుంది. ఈ బాండ్ పేపర్ ఆధారంగా బ్యాంకులు రైతులతో ట్రైపార్టీ అగ్రిమెంట్ చేసుకొని ఏడాది కాల వ్యవధికి రుణాలు మంజూరు చేస్తాయి. బాండ్ పేపర్ బ్యాంకు వద్దనే ఉంటుంది. బాండ్ పేపర్ లేనిదే కోల్డ్‌స్టోరేజ్ యజమాని ఆ స్టాకుని రిలీజ్ చేయడానికి వీల్లేదు. రైతు బ్యాంకు రుణాన్ని చెల్లించి బాండ్ పేపరు తెచ్చి ఇచ్చి ఆ స్టాకుని విక్రయించుకోవచ్చు. పైకి నిబంధన ఇలా కఠినంగా ఉన్నా దీనిలో ఎన్నో లొసుగులున్నాయి.


రాఘవేంద్ర కోల్డ్‌స్టోరేజీలో మార్కెటింగ్, పోలీసు అధికారుల తనిఖీలు

రూ. 2.80 కోట్ల మేర స్టాకు కన్పించడం లేదు

కమీషన్ వ్యాపారి, శీతల గిడ్డంగి యజమాని చేతులు కలిపితే రైతుల మిర్చికి భద్రత లేకుండా పోతుంది. నకిలీ బాండ్ పేపర్ పుస్తకాలను ముద్రించి వేరే రైతుల ఆధార్, పాన్ నంబర్లను పెట్టి గ్యారెంటీర్‌గా కోల్డ్‌స్టోరేజ్ యజమాని సంతకం చేస్తుండటంతో బ్యాంకులు ఇట్టే రుణాలు మంజూరు చేస్తున్నాయి. ముఖ్యంగా జీడీసీసీ నల్లపాడు బ్రాంచ్ ఇందుకు కేంద్ర బిందువుగా మారింది. ఆ బ్యాంకు 2023లో 129 బాండ్ పేపర్లు తనఖా పెట్టుకొని రూ.8 కోట్ల 77 లక్షల 33 వేలు మంజూరు చేసింది. వాటిల్లో కేవలం రూ. 4.32 కోట్లు మాత్రమే ఇప్పటి వరకు వసూలు చేయగలిగింది. తాజాగా రాఘవేంద్ర కోల్డ్‌స్టోరేజ్‌లో 33 మంది రైతుల పేర్లతో తీసుకున్న రుణాలకు సంబంధించి స్టాకు కనిపించడం లేదని తేలింది. దీని విలువ రూ.2.80 కోట్ల వరకు ఉండొచ్చని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. కాగా తమిళనాడు మర్కెంటైల్ బ్యాంకు కూడా ఈ నకిలీ బాండ్ పేపర్లను పెట్టుకొని రుణాలను మంజూరు చేసింది. ఆ బ్యాంకులో ఎంతమేరకు మోసం జరిగిందనే దానిపై లెక్కిస్తున్నారు.

జిల్లా కలెక్టర్‌కు జేడీ నివేదిక

రాఘవేంద్ర కోల్డ్‌స్టోరేజ్ ఉదంతంపై ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మార్కెటింగ్ కమిషనర్, జిల్లా ఎస్పీతో మాట్లాడటంతో ఉన్నత స్థాయిలో కదలిక వచ్చింది. మంగళవారం మార్కెటింగ్ శాఖ జేడీ కాకుమాను శ్రీనివాసరావు, డీడీ ఝాన్సీరాణి, సెక్రెటరీ ఐ.వెంకటేశ్వరరెడ్డి, యార్డు ఇన్‌ఛార్జ్ శ్రీకాంత్, నల్లపాడు సీఐ వంశీధర్ తదితరులు రాఘవేంద్ర కోల్డ్‌స్టోరేజ్‌కి చేరుకొని రికార్డులన్నింటిని వడపోత పట్టారు. మొత్తం 9,719 టిక్కీలను రాము అనే కమీషన్ వ్యాపారి కనుసన్నల్లో రైతుల పేర్లతో నిల్వ చేయగా వాటిల్లో 2,577 ఇప్పటికే అమ్మేశారు. మరో 2,849 బ్యాంకుల్లో పెట్టి రుణాలు తీసుకున్నారు. 4,293 బస్తాలు మాత్రం కోల్డ్‌స్టోరేజ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. దీనిపై సమగ్ర నివేదికని మార్కెటింగ్ జేడీ జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి అందజేశారు. కోల్డ్‌స్టోరేజ్ యజమాని, కమీషన్ వ్యాపారిపై చీటింగ్, క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు పోలీసు అధికారులు చెప్పారు.


రాఘవేంద్ర కోల్డ్‌స్టోరేజీ బయట రైతులు

రైతులు విధిగా బాండ్లు తీసుకోవాలి

కోల్డ్‌స్టోరేజీలలో రైతులు మిర్చి బస్తాలను నిల్వ చేసిన వెంటనే సంబంధిత యాజమాన్యం వద్ద బాండ్లను విధిగా తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ జేడీ కాకుమాను శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ఆ బాండ్ పేపర్లను ఎవరికీ ఇవ్వకుండా రైతుల వద్దనే భద్రంగా ఉంచుకోవాలన్నారు. కొంతమంది రైతులు వ్యాపారస్తులను నమ్మి తమ బాండ్లను తీసుకోవడం లేదనీ, దీనివలన మోసాలు జరుగుతున్నాయన్నారు. ఎట్టి పరిస్థితుల్లో బాండ్లను వ్యాపారస్తుల వద్ద ఉంచొద్దన్నారు. వ్యాపారస్తుల వద్ద బాండ్లు ఉంటే వాళ్లు వాటిని బ్యాంకుల్లో పెట్టి రుణాలు పొందే ప్రమాదం ఉందన్నారు. అలానే అమ్ముకోవడానికి కూడా ఆస్కారం ఉందని చెప్పారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

- 38వ రోజు ప్రజాదర్బార్‌లో అర్జీదారులకు మంత్రి లోకేశ్ భరోసా

తాడేపల్లి, అక్టోబరు 1: ప్రజాదర్బార్‌లో 38వ రోజు పలువురు తమ సమస్యలను మంత్రి లోకేశ్‌కు విన్నవించారు. పలువురు దివ్యాంగులు తమ ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరిస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు. ఎవరూ అధైర్య పడొద్దు, అండగా ఉంటానని, సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని అర్జీదారులకు లోకేశ్ భరోసా ఇచ్చారు.

రూ.3 కోట్లతో పరారయ్యాడు..

గ్రామస్థుల నుంచి రూ.3 కోట్ల వరకు అప్పుగా తీసుకుని పరారైన గోరిజాల శ్రీనివాసరావును అరెస్టు చేసి బాధితులకు న్యాయం చేయాలని పెదవడ్లపూడి గ్రామానికి చెందిన మాజీ సర్పంచి అన్నే చంద్రశేఖర్ మంత్రికి ఫిర్యాదు చేశారు. పరిశీలించి న్యాయం చేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. పక్షవాతంతో బాధ పడుతున్న తనకు పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని మంగళగిరికి చెందిన అక్కల శివశంకరరావు విజ్ఞప్తి చేశారు. ఇటీవల సంభవించిన వరదలకు తమ ఇళ్లలోకి నీరు చేరి సామగ్రి పూర్తిగా పాడైపోయాయని, నష్టపరిహారం అందించి ఆదుకోవాలని మహానాడు ప్రాంత వాసులు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ప్రకటించిన పరిహారం అందలేదని, విచారించి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రోజువారీ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న తాను ఇటీవల అనారోగ్యం బారినపడ్డానని భర్త కూడా లేని తనకు వితంతు పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని ఆత్మకూరు వడ్డెరపాలెంకు చెందిన వేముల సీతమ్మ కోరారు. పుట్టుకతో దివ్యాంగురాలినైన తాను ఇంటర్ వరకు చదువుకున్నానని ఇటీవల తన తల్లిదండ్రుల ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబ జీవనం భారంగా మారిందని ఆత్మకూరుకు చెందిన తమ్మిశెట్టి రాధాకీర్తి కన్నీటి పర్యంతమయ్యారు. ఉద్యోగావకాశం కల్పిస్తే కుటుంబానికి అండగా ఉంటానని కోరారు.


వినతి పత్రం స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

కబ్జా చేశారు...

అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం కొనింపూడిలో తన తండ్రికి చెందిన 1.95 ఎకరాలను ఫోర్జరీ డాక్యుమెంట్‌లతో జి.నాగ వెంకట సత్యనారాయణ కబ్జా చేశారని న్యాయం చేయాలని కోరారు. వివిధ యూనివర్సిటీల్లో కాంట్రాక్టు, తాత్కాలిక అకడమిక్ కన్సల్టెంట్ విధానంలో పని చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లకు మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేసి రెగ్యులరైజ్ చేయాలని రాజమండ్రికి చెందిన అడ్‌హాక్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ప్రకాశం జిల్లా కంభం మండలం కందులాపురంలో తన కుటుంబానికి చెందిన 1.09 ఎకరాల పట్టా భూమిని గత వైసీపీ ప్రభుత్వం నిర్వహించిన రీ సర్వేలో గ్రామ కంఠంగా నమోదు చేశారని, విచారించి తగిన న్యాయం చేయాలని మార్కాపురంకు చెందిన రాచకొండ లక్ష్మీదేవి ఫిర్యాదు చేశారు. నెల్లూరు జిల్లా కోటలోని ఎన్‌బీకేఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి చెందిన ఉపాధ్యాయేతర సిబ్బందికి ట్రిబ్యునల్ తీర్పు అమలు చేయడంతోపాటు సర్వీసులో మరణించిన, రిలీవ్ చేసిన యూనియన్‌లోని ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సిబ్బంది విజ్ఞప్తి చేశారు.

అంబటి మురళిపై కేసు నమోదు

పొన్నూరుటౌన్, అక్టోబరు1: వైసీపీ నాయకుడు అంబటి మురళీకృష్ణపై అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇటీవల తిరుమల లడ్డూ కల్తీ వివాదంపై వైసీపీ నాయకుడైన అంబటి మురళీకృష్ణ, మరో 12 మంది గత నెల 28వ తేదీన పట్టణంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీసహస్రలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని స్వర్ణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఆలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు వ్యతిరేకంగా పూజలు నిర్వహించటమే కాకుండా రాజకీయ ప్రసంగాలు చేశారనే ఆరోపణలు వచ్చాయి. ఆలయం ముందు బైఠాయించిన వైసీపీ నాయకులు భక్తులను లోపలకు వెళ్లనివ్వకుండా ధర్నా నిర్వహించారు. దీనిపై పట్టణానికి చెందిన తోటకూర నరేష్ బాబు అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పవిత్రమైన దేవాలయాన్ని నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ కార్యకలాపాలకు వేదికగా మార్చటమే కాకుండా భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ధర్నాలు నిర్వహించారని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై విచారించిన అర్బన్ పోలీసులు వైసీపీ నాయకులు అంబటి మురళీ కృష్ణ, షేక్ సైపుల్లా, షేక్ నాజర్, భవనం పద్మలీలా, అంబటి వెంకటేశ్వరరావు, గేర సంజీవ్, కందుల వెంకట సుబ్బారావు, నాగ ప్రసాద్, ఎండేడి వెంటక సుబ్బయ్య, మామిళ్లపల్లి మోహనరావు, దేవరపల్లి వినోద్, శ్రీరెడ్డి తదితరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధరణికోట సమీపంలో బౌద్ధ శిల్పాలు లభ్యం


పొలంలో లభించిన రాతిమీద చెక్కిన శిల్పం, శాసనం

అమరావతి, అక్టోబరు 1: ధరణికోట గ్రామ రెవెన్యూ పరిధిలోని సాగుభూమిలో క్రీ.పూ 3వ శతాబ్దానికి చెందిన బౌద్ధ శిల్ప ఖండాలు మంగళవారం లభించాయి. గ్రామానికి చెందిన కొమ్మినేని పిచ్చియ్యకు చెందిన పొలంలో ట్రాక్టర్‌తో దున్నుతుండగా పాలరాతి శిల్పఖండాలు బయటపడ్డాయి. సమాచారాన్ని పిచ్చియ్య కుమారుడు వెంకట్రావు రెవెన్యూ, పురావస్తుశాఖ అధికారులకు తెలియజేశారు. పురావస్తు శాఖ అధికారి అసిస్టెంట్ సూపరింటెండెంట్ సూర్యప్రకాష్ పర్యవేక్షణలో తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో శిల్పాలను స్థానిక పురావస్తు సంగ్రహాలయానికి తరలించి భద్రపర్చారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది సురేష్, మ్యూజియం సిబ్బంది శ్రీనివాస్, చినబాబు పాల్గొన్నారు. లభించిన శిల్పంపై గౌతమ బుద్ధుని తల్లి మాయాదేవికి చెలికత్తెలు సపర్యలు చేస్తున్న దృశ్యం చెక్కి ఉంది. దిగువన అప్పటి శాసనం ఉంది.

'దేవర' సక్సెస్ ఈవెంట్ నిర్వహణకు స్థల పరిశీలన



పెదకాకాని, అక్టోబర్ 1: దేవర సినిమా సక్సెస్ ఈవెంట్‌ను నిర్వహించేందుకు ఎంపిక చేసిన స్థలాన్ని మంగళవారం మంగళగిరి డీఎస్పీ మురళీకృష్ణ పరిశీలించారు. నంబూరు అడ్డరోడ్డు సమీపంలోని విశాల ప్రాంతాన్ని ఆయన సందర్శించి, ఈవెంట్ నిర్వహణపై ఆర్గనైజర్లతో చర్చించారు. గతంలో గుంటూరు కారం సినిమా ఈవెంట్ జరిగినప్పుడు జరిగిన అపశ్రుతులను పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పెదకాకాని సీఐ నారాయణస్వామి, ఎస్సై మేరాజ్, ఈవెంట్ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

రేపటి నుంచి ఉపాధ్యాయ అర్హత పరీక్ష

- జిల్లాలో నాలుగు కేంద్రాలు
- పరీక్షకు హాజరుకానున్న 18,476మంది అభ్యర్థులు

గుంటూరు(విద్య),అక్టోబరు 1: జిల్లాలో రేపటి నుంచి ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) నిర్వహించనున్నారు. కంప్యూటర్ ఆధారంగా నిర్వహించే ఈ పరీక్షలకు నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షకు మొత్తం 18,476 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు డీఈవో పి.శైలజ వెల్లడించారు. పరీక్షలు ఈ నెల 3వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం, సాయంత్ర పరీక్ష జరుగుతుందన్నారు. ప్రతి రోజూ ఉదయం 8 గంటలకు పరీక్షా కేంద్రాలకు రావాలని, 9.30 తరువాత ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రాల్లోకి అనుతించమని స్పష్టం చేశారు. అదేవిధంగా సాయంత్రం 2 గంటల కల్లా పరీక్షా కేంద్రాలకు రావాలని స్పష్టం చేశారు. పరీక్షకు హాజరయ్యేవారు హాల్‌టికెట్‌తోపాటు ఏదైనా గుర్తింపు పత్రంతో రావాలని సూచించారు.

నరసరావుపేటలో నాలుగు టెట్ పరీక్షా కేంద్రాలు

నరసరావుపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లాలో ఏపీ టెట్ పరీక్షల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేశారు. 3 నుంచి 21 వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల నిర్వహణకు నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలకు 9,556 మంది అభ్యర్థులు హాజరవుతున్నారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించుటకు ప్రతి సెంటర్‌లో పూర్తి స్థాయిలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఈవో వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. నరసరావుపేట ఇంజనీరింగ్ కాలేజి, కోటప్పకొండ రోడ్డు, యల్లమంద, నరసరావుపేట ఇంజనీరింగ్ కాలేజి, అటానమస్ బ్లాక్-4, కోటప్పకొండ రోడ్డు, యల్లమంద, నరసరావుపేట. ఏ.ఎం.రెడ్డి మెమోరియల్ కాలేజి ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, అట్లూరి మస్తాన్ రెడ్డి నగర్, పెట్లూరి వారి పాలెం, నరసరావుపేట, ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజీ, కేసానుపల్లి నరసరావుపేట. విద్యాశాఖ అధికారి వారి కార్యాలయం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశారు. అభ్యర్థుల సందేహాల నివృతికి ఈ కింది నంబర్లను సంప్రదించాలని డీఈవో సూచించారు. కె. ప్రసాద్ బాబు, సూపరింటెండెంట్ 9704494654, వై.తిరుపతి రావు, జూనియర్ అసిస్టెంట్, 9177020977, జి.జీవరత్నం 9866904960, పి.శంకర్ రాజు 9963192487లో సంప్రదించాలని వివరించారు.

వైసీపీ నాయకులు పద్ధతులు మార్చుకోవాలి

- ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, అక్టోబరు 1: వైసీపీ నేతలు ఇకనైనా తమ పద్ధతులు మార్చుకోవాలని, రెచ్చగొట్టే ధోరణిని విడనాడాలని, దాడులకు పాల్పడితే బీకేర్‌ఫుల్...అంటూ గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు వైసీపీ నేతలను హెచ్చరించారు. మంగళవారం పిడుగురాళ్ల పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలకే వైసీపీ నేతలు బరితెగింపునకు పాల్పడుతున్నారని, తురకపాలెం మాజీ సర్పంచ్‌పై దాడి చేయడమే కాకుండా ఇటీవల రేగులగడ్డలో కానిస్టేబుల్‌పై కూడా వైసీపీ నేతలు దాడికి పాల్పడటం వెనుక వైసీపీ నేతల రెచ్చగొట్టే విధానం కనిపిస్తుందన్నారు. ఇకనైనా వైసీపీ నేతలు పద్ధతులు మార్చుకొని జీవించాలంటూ తీవ్రంగా హెచ్చరించారు. 2014-19 మధ్యకాలంలో గురజాల నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధే తప్ప 2019-24 మధ్య వైసీపీ హయాంలో జరిగిన అభివృద్ధి ఏమీలేదని, 2019-24 మధ్యకాలంలో అక్రమ మైనింగ్‌తో 8 మంది చిన్నారులు, 11 మంది టీడీపీ కార్యకర్తల హత్యకు గురయ్యారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు అవుతుందని, ఇంకా కొందరు వైసీపీ నేతలు తమ ప్రభుత్వంలో సాగించిన అరాచకాలనే సాగించాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. ఎన్నికలకు ముందు నేను చెప్పినట్లుగా యరపతినేని శ్రీనివాసరావుగానే చూడాలని, మంచికల్లు శ్రీనుగా చూడొద్దన్నారు. డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, వెంకటేశ్వర్లు, వడ్డవల్లి సాంబశివరావు, కామిశెట్టి రమేష్, పిల్లి చెన్నారావు, పణితి రవి, మందా డేవిడ్, దూదేకుల ఖాశింసైదా, వేముల అంజనేయులు, బత్తుల శ్రీను, ముప్పాళ్ల సాంబయ్య, సురేష్, ఎల్‌వీఆర్, కమిషనర్ శ్రీధర్ ఉన్నారు.

ప్రపంచం గర్వించదగిన తత్వవేత్త సచ్చిదానంద మూర్తి


సచ్చిదానందమూర్తి కుటుంబ సభ్యుల్ని సత్కరిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు(విద్య),అక్టోబరు 1:ప్రపంచం గర్వించదగిన తత్వవేత్తగా ఆచార్య కొత్త సచ్చిదానంద మూర్తి ఎనలేని ఖ్యాతి గడించారని మాజీ రాజ్యసభ సభ్యులు, విశ్వ హిందీ పరిషత్ నేషనల్ ప్రెసిడెంట్ వై.లక్ష్మీప్రసాద్ అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎన్‌టీఆర్ విజ్ఞాన్ లైబ్రరీ, స్కూల్ ఆఫ్ అప్లయిడ్ సైన్సెస్ అండ్ హ్యుమానిటీస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆచార్య కొత్త సచ్చిదానంద మూర్తి శత జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ చదువులో ఉన్న మర్మాన్ని గ్రహించారు కనుకే కొత్త సచ్చిదానంద మూర్తి గొప్ప తత్వవేత్తగా ఎదిగారని అన్నారు. తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ ఫిలాసఫీ డిపార్ట్‌మెంట్ మాజీ హెడ్, ప్రొఫెసర్ సాంబశివ ప్రసాద్, విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వీసీ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ కొత్త రమేష్, రావెల సాంబశివరావు, డాక్టర్ సి.వెంకటాచలం, డాక్టర్ పి.సుబ్బారావు, సచ్చిదానంద మూర్తి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెపక్ తక్రా పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి రూరల్, అక్టోబరు 1 : విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమని, క్రీడాకారులకు మంచి భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని పెద మక్కెన జెడ్పీ హైస్కూల్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏపీ స్కూల్ గేమ్స్ 68వ చెపక్ తక్రా రాష్ట్ర స్థాయి పోటీలను ఎమ్మెల్యే కన్నా మంగళవారం ప్రారంభించి ప్రసంగించారు. పోటీల్లో సెమీస్‌కు చేరిన జట్ల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కర్నూలు జట్టు పై కడప, నెల్లూరు జట్టు పై గుంటూరు జట్టు, అనంతపురం జట్టుపై ప్రకాశం, విజయనగరంపై పశ్చిమ గోదావరి జిల్లా బాలుర జట్టు విజయం సాధించి సెమీ ఫైనల్‌కు చేరగా బాలికల విభాగంలో నెల్లూరుపై అనంతపురం జట్టు, కడప పై కర్నూలు, గుంటూరుపై పశ్చిమ గోదావరి, విజయనగరం జిల్లా జట్టుపై కృష్ణా జిల్లా జట్టు విజయం సాధించాయి. చెపక్ తక్రా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు, టోర్నమెంట్ రాష్ట్ర పరిశీలకులు మారుతీ ప్రసాదు, అండర్ - 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి నరసింహారావు, సహాయ కార్యదర్శి సీహెచ్ పద్మాకర్ పాల్గొన్నారు.

బాపట్ల వార్తలు

ఓటర్ల సర్వే ప్రక్రియ జిల్లాలో 99.09 శాతం పూర్తి

● కలెక్టర్ జె.వెంకటమురళి



సమావేశంలో వివరాలు తెలియజేస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, జేసీ ప్రఖర్‌జైన్

బాపట్ల, అక్టోబరు 1 : ఇంటింటా ఓటర్ల సర్వే ప్రక్రియ జిల్లాలో 99.09 శాతం పూర్తయిందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం సంక్షిప్తసవరణ ఓటర్ల జాబితా తయారీకి అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన విషయమై రాష్ట్ర ఎన్నికల కమిషన్ సీఈవో వివేక్‌యాదవ్ వీక్షణా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర రాజధాని నుంచి ఆయన నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ కోసం 12,526 దరఖాస్తులు ఇప్పటి వరకు అందాయన్నారు. 6,327 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వారంలోగా పరిష్కరిస్తామని ఎన్నికల కమిషన్ సీఈవో దృష్టికి తీసుకెళ్ళారు. అభ్యంతరాలపై 6,439 దరఖాస్తులు రాగా 5,820 పరిష్కరించామని, మిగిలినవి రెండురోజుల్లో విచారిస్తామన్నారు. 6,408 మంది బాపట్ల జిల్లాలో మృతి చెందినట్లు గుర్తించామన్నారు. ప్రస్తుతం 5,441 మంది మృతుల వివరాలను పూర్తిస్థాయిలో విచారించామన్నారు. వీక్షణా సమావేశంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, ఆర్డీవో పి.గ్లోరియా, ఏఈఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

చివరి భూములన్నిటికి సాగునీరందించాలి : కలెక్టర్

చివరి ఆయుకట్టు భూములన్నిటికి సాగునీరు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. 5వ నీటిపారుదల సలహా మండలి సమావేశం మంగళవారం కలెక్టరేట్‌లో జరిగింది. కృష్ణా పశ్చిమడెల్టా, సాగర్ కాల్వల కింద ఉన్న భూములు సస్యశ్యామలంగా పంటలు పండటమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ చెప్పారు. పశ్చిమడెల్టా కింద మరికొన్ని పనులకు 9.48 కోట్ల నిధులు విడుదలయ్యాయన్నారు. పంటకాల్వల పటిష్టతతో గట్లు బలోపేతం చేయాలని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. కాల్వలలో పూడికతీత, చెట్లు, తూటికాడ తొలిగించాలన్నారు. కృష్ణానది పశ్చిమడెల్టా కింద బాపట్ల నియోజకవర్గంలోని దిగువప్రాంతాలకు సాగునీరు అందటంలేదన్నారు. సమావేశంలో జేసీ ప్రఖర్‌జైన్, డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు, జలవనరులశాఖ ఎస్‌ఇ అబూతలీమ్, ఇ ఇలు వెంకటరత్నం, మురళీకృష్ణ, డీఈలు రైతులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికి సంక్షేమఫలాలు

బాపట్ల, అక్టోబరు 1 : అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించనున్నట్లు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. బాపట్ల ఏరియా వైద్యశాలలో దివ్యాంగులకు మంగళవారం అర్హత పత్రాలను పంపిణీ చేశారు. అక్కడ జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు లబ్ధిదారులకు పెన్షన్ పెంచి ఇవ్వటం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో అర్హులందరికి కొత్త పెన్షన్లు మంజూరు చేసి ఇవ్వటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు శివ సాంబిరెడ్డి, జనసేన సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు మందపాటి ఆంధ్రేయ, సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దార్ధ పాల్గొన్నారు.

అత్యాశకు పోవద్దు... సైబర్ కేటుగాళ్ళ వలలో పడవద్దు

● ఎస్పీ తుషార్ డూడీ



బాపట్ల, అక్టోబరు 1 : వెబ్‌సైట్‌ల ద్వారా సైబర్ నేరాలకు పాల్పడుతున్న కేటుగాళ్ళ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. ఈ విషయమై మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రజల అత్యాశే సైబర్ నేరగాళ్ళ ఆయుధం అన్నారు. అత్యాశకు పోయి సైబర్ కేటుగాళ్ళ వలలో పడి మోసపోవద్దు అన్నారు. కష్టార్జితం సైబర్ నేరస్తులపాలు చేయవద్దు అన్నారు. అపరిచిత వైబ్‌సైట్స్, ఏపీకే ఫైల్స్ క్లిక్ చేయవద్దు అన్నారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సైబర్ మోసాలు గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగియుండాలన్నారు. అవగాహన కలిగి ఉంటే చాలా వరకు నేరాలు తగ్గించవచ్చుఅన్నారు. ఏదైన సైబర్ నేరం జరిగిన వెంటనే 1930కి కాల్ చేయాలన్నారు. ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న సొమ్ము చాలా వరకు తిరిగి పొందే అవకాశం ఉంటుందన్నారు. చిన్న టాస్కుల ద్వారా గెలిచిన సొమ్ము ఖాతాలలో జమ చేస్తారని ఆ తర్వాత తక్కువ మొత్తంలో డబ్బులు పెట్టుబడి పెట్టించి రెండింతలు, మూడింతలు అధిక ఆదాయం ఇచ్చి ఆశ చూపుతారన్నారు. అత్యాశకు పోయి సైబర్ కేటుగాళ్ళ వలలో పడవద్దని ఎస్పీ తెలిపారు.

వృద్ధుల సంక్షేమ భవనం ఏర్పాటుకు కృషి : కమిషనర్



సీనియర్ సిటిజన్స్‌ను సన్మానిస్తున్న కమిషనర్ నిర్మల్‌కుమార్ తదితరులు

బాపట్ల, అక్టోబరు 1 : బాపట్లలో వృద్ధుల సంక్షేమ భవనం ఏర్పాటుకు కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ స్పష్టం చేశారు. బాపట్ల ఎన్జీవో హోమ్‌లో మంగళవారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని భావపురి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి కమిషనర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ వృద్ధులకు పెన్షన్‌లు పంపిణీ చేసే విషయంలో పూర్తి సహకారం అందిస్తామన్నారు. సభలో ప్రముఖ సినీరంగస్థలనటుడు, రచయిత, ఎన్టీఆర్ అవార్డు గ్రహీత కె.ఎస్.టి.శాయి మాట్లాడుతూ బాపట్ల సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్‌కు ఒక భవనం నిర్మించేందుకు స్థలం కల్పించాల్సిందిగా కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం అసోసియేషన్ నాయకులు జీవీ బ్రహ్మం, కోటి సుబ్బారావు, దివి శ్రీనివాసమూర్తి, రావూరి నరసింహవర్మ, పీఎస్ ఆనంద్‌కుమార్ తదితరులను ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమలో డాక్టర్ నరేష్‌రెడ్డి, బొలగాని వెంకటేశ్వర్లు, శాంతారం, శ్రీహరిరావు, కామరాజు కాళీదాసు, సిద్దయ్య, బందాబాబు, డాక్టర్ వీసీ సాయిబాబు, డాక్టర్ శ్రీనివాసరావు, పి.చినవీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వ్యాసరచన, డిబేట్, చిత్రలేఖనం పోటీలు

బాపట్ల, అక్టోబరు 1 : అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య, కుటుంబసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వ్యాసరచన, డిబేట్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పోటీలలో విజేతల వివరాలను మంగళవారం బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లాసైన్స్ అధికారి ఎండీ సాదిక్ తెలిపారు. విజేతలను వైద్య, ఆరోగ్యశాఖాధికారి టి.మరియమ్మ, జిల్లా విద్యాశాఖాధికారి కె.నారాయణరావు తదితరులు అభినందించారు.

పోషకాహార, ప్లాస్టిక్ నివారణపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అసోసియేట్‌డీన్ డాక్టర్ బేగ్, విద్యార్థులు, అధ్యాపకులు

బాపట్ల, అక్టోబరు 1 : స్వభావ స్వచ్ఛత సంస్కార స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన శాస్త్రసంకేతిక కళాశాల విద్యార్థులు మంగళవారం పోషకాహార, ప్లాస్టిక్ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.ఎస్.బేగ్ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు డాక్టర్ విమలబీర, డాక్టర్ బ్లెస్సీసాగర్, డాక్టర్ ఇ.గౌతమిల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్లీన్ ఇండియా, గ్రీన్ ఇండియా, ప్లాస్టిక్ నిషేదిద్దామంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్లాస్టిక్ సంచులు, బాటిల్స్ ఏరివేశారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో...

స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో పడవేసిన వ్యర్థాలను తొలిగించి శుభ్రం చేశారు. అసోసియేట్ డీన్ డాక్టర్ డీడీ స్మిత్ కార్యక్రమాన్ని ప్రారంభించగా ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు డాక్టర్ కె.లావణ్య, డాక్టర్ డి.విజయ్‌కుమార్‌లు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొని సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలి : డీఎస్పీ

బాపట్ల, అక్టోబరు 1 : వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలని డీఎస్పీ రామాంజనేయులు తెలిపారు. పట్టణంలోని గడియార స్తంభం కూడలి, కొత్తబస్టాండ్, పాతబస్టాండ్ పరిసరాలలో పోలీసుసిబ్బంది, రవాణాశాఖాధికారులతో కలిసి వాహన చోదకులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్ వినియోగించటం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణపాయం తప్పుతుందన్నారు. హెల్మెట్ ధరించకుంటే అపరాధ రుసుం వసూలు చేయటం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మోటారు వాహనాల తనిఖీ అధికారి రంగారావు, పట్టణ, రూరల్ సీఐలు ఆర్.అహ్మద్ జానీ, గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లు పంపిణీ



ఎన్టీఆర్ భరోసా పింఛన్లు లబ్దిదారులకు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

కర్లపాలెం, అక్టోబరు 1 : కర్లపాలెం మండలం దమ్మనవారిపాలెం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో మంగళవారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అధికారులు, నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్ళి పెన్షన్‌దారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి.గ్లోరియా, డీపీవో రవికుమార్, తహసీల్దార్ వెంకటరత్నం, ఎంపీడీవో శ్రీనివాసరావు, జనసేన సమన్వయకర్త నామన శివన్నారాయణ, ఏపూరి భూపతిరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

● లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని టీడీపీ పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజనీ తెలిపారు. మండలంలోని కొండుభొట్లపాలెంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ చేశారు. పల్లంజీవన్, మార్పుప్రతాప్ పాల్గొన్నారు.

● మండలంలోని నందిరాజుతోట గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను మంగళవారం టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ, ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దార్ శ్రీదేవి సిబ్బందితో కలిసి ఇంటింటా కలిసి పెన్షన్లు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● కొల్లూరు, అక్టోబరు 1 : కొల్లూరు మండలంలో 98 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో నరసింహారావు తెలిపారు. మిగిలిన రెండు శాతం లబ్ధిదారులకు బుధ, గురువారాల్లో సిబ్బంది పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

● పిట్టలవానిపాలెం, అక్టోబరు 1 : మండలంలోని 14 గ్రామపంచాయతీలలో మండల ప్రత్యేకాధికారి సువార్త, ఎంపీడీవో ఐ.సత్యనారాయణ, ఈవోపీఆర్డీ కె.పద్మజ, సచివాలయాల ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు కూటమి నాయకులతో కలిసి పెన్షన్‌లు పంపిణీ చేశారు.

రాష్ట్ర అవతరణలో బాపట్లది అద్భుతమైన పాత్ర

● అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్

బాపట్ల, అక్టోబరు 1 : ఆంధ్రరాష్ట్ర అవతరణలో బాపట్ల అద్భుతమైన పాత్రను పోషించినట్లు అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ అన్నారు. ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో మంగళవారం 71వ రాష్ట్ర అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. టౌన్‌హాలులోని తెలుగుతల్లి విగ్రహానికి ఫోరం కార్యదర్శి డాక్టర్ పీసీ.సాయిబాబుతో కలిసి అడిషనల్ ఎస్పీ పుష్పాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రోద్యమం బాపట్లలోనే పురుడుపోసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏవీ రమణరావు, అధ్యాపకులు కలాం, పౌరసమైక్యనాయకులు కె.విజయ్‌కుమార్, రమణకుమార్, యువి.రామారావు, గుంట్రెడ్డి సత్యనారాయణ, భవానీదేవి, మానం అప్పారావు, ఎడ్ల సత్యవతి, కరణం రవీంద్ర, సత్యనారాయణరాజు పాల్గొన్నారు.



తెలుగుతల్లి విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఏఎస్పీ విఠలేశ్వర్, డాక్టర్ సాయిబాబు తదితరులు

గ్రామీణ మహిళల ఉపాధి కల్పనకు కృషి

బాపట్ల, అక్టోబరు 1 : వనరుల వితరణ ద్వారా గ్రామీణ మహిళల ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నట్లు ఎస్టూ నీడి ఫౌండేషన్ డైరెక్టర్ తోట సురేష్‌బాబు తెలిపారు. పట్టణంలోని విజయలక్ష్మీపురంలో మహిళలకు కుట్టు శిక్షణ ఏర్పాటు చేశారు. శిక్షణ పొందిన పిల్లి ద్రాక్షవలికి మంగళవారం శిక్షకురాలు కుండేటి శివకుమారి ద్వారా ఉచిత కుట్టుమిషన్ అందజేశారు.

శ్రీబగళాముఖిని దర్శించుకున్న పెద్దపల్లి మాజీ ఎంపీ

పిట్టలవానిపాలెం, అక్టోబరు 1 : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి ఆలయానికి తెలంగాణ రాష్ట్రం పెద్దపల్లి మాజీ ఎంపీ గొర్లకుంట వెంకటేష్ విచ్చేసి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.నాగేశ్వరరావు అమ్మవారి ఆలయ విశేషాలు తెలియజేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆయనను దుశ్శాలువాలతో సత్కరించి అమ్మవారి చిత్రపటాలను, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్చకుడిపై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలి

బాపట్ల, అక్టోబరు 1 : తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలో ఉన్న శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో పనిచేస్తున్న అర్చకుడు బాపేశ్వరశర్మపై దాడి చేసిన కొండవీటి వెంకయ్యను తక్షణమే అరెస్ట్ చేయాలని అర్చక సేవాసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బృందావనం గోపిచంద్ డిమాండ్ చేశారు. జిల్లా సంఘ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెంకయ్యపై చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిస్తామన్నారు. సమావేశంలో మేడూరి శ్రీనివాసమూర్తి, అనంత చక్రవర్తి, సత్యంబాబు, పాంచజన్యం, స్వర్ణరాఘవ, భార్గవ, పారశరం రమేష్, గోవాడ సిద్దాంతి తదితరులు పాల్గొన్నారు.

మహిళపై కోతి దాడి

బాపట్ల, అక్టోబరు 1 : పట్టణంలోని విజయలక్ష్మీపురం పరిసరప్రాంతాలలో సంచరిస్తున్న కోతులు మంగళవారం ఓ మహిళపై దాడి చేసి మోచేతిపై కరిచి గాయపరిచాయి. వెంటనే సదరు మహిళ ఆసుపత్రికి వెళ్ళి చికిత్స చేయించుకుంది. కాగా ఈవిషయమై మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్‌ను వివరణ కోరగా కోతులు పట్టించి అడవిలో వదిలిపెట్టేందుకు కోతులు పట్టేవారిని తీసుకురావటం జరిగిందన్నారు. అనేకప్రాంతాలలో బోనులు పెట్టినప్పటికి ఒక్కకోతి కూడా చిక్కకుండా పారిపోతున్నాయని తెలిపారు. కొండముచ్చు తీసుకొచ్చి వీధులలో తిప్పి కోతులను అడవులకు పంపించే ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ముత్తాయపాలెం సచివాలయ ఉద్యోగికి పీహెచ్‌డీ పట్టా

బాపట్లరూరల్, అక్టోబరు 1 : బాపట్ల మండలం ముత్తాయపాలెం గ్రామసచివాలయంలో వ్యవసాయ శాఖ విలేజ్ సహాయకులుగా విధులు నిర్వర్తిస్తున్న సీహెచ్ శ్యామ్‌కుమార్ మంగళవారం హైదరాబాద్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. గ్రామంలో వ్యవసాయ సహాయకులుగా రైతులకు సేవలందిస్తూనే మరోవైపు ప్రఖ్యాతిగాంచిన హైదరాబాద్ యూనివర్సిటిలో మానవశాస్త్రం విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేసి పట్టా అందుకున్నారు. శ్యామ్‌కుమార్‌ను బాపట్ల వ్యవసాయశాఖ ఏడీఏ లక్ష్మీ, వ్యవసాయశాఖాధికారి చంద్రశేఖర్‌లు శ్యామ్‌కుమార్‌ను అభినందించారు.

శ్రీవేంకటేశ్వరస్వామికి దీపారాధన కార్యక్రమం

కర్లపాలెం, అక్టోబరు 1 : కర్లపాలెం గ్రామంలోని రామ మందిరంలో తిరుమల శ్రీవారి లడ్డూ విషయంలో జరిగిన అపరాధానికి బాపట్ల జనసేనపార్టీ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ ఆదేశాలమేరకు జనసేన వీర మహిళల ఆధ్వర్యంలో కలియుగ శ్రీవేంకటేశ్వరస్వామికి దీపారాధన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు.

పర్యాటకుల రక్షణకు ప్రత్యేక చర్యలు : మెరైన్ సీఐ

బాపట్ల, అక్టోబరు 1 : ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న సూర్యలంక సముద్రతీరంలో గస్తీముమ్మరం చేయటంతోపాటు పర్యాటకుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మెరైన్ సీఐ లక్ష్మారెడ్డి తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన మంగళవారం స్టేషన్ పరిసరాలలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలిగించి శుభ్రం చేయించారు. టీడీపీ నాయకులు కావూరి శ్రీనివాసరెడ్డి సహకారంతో ఫలసాయం ఇచ్చే మొక్కలను తీరం వెంట నాటుతున్నట్లు తెలిపారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన సదస్సు

కర్లపాలెం, అక్టోబరు 1 : కర్లపాలెం ఐలెండ్ సెంటర్‌లో హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ రామాంజనేయులు, సీఐ హరికృష్ణ, కర్లపాలెం ఎస్సై రవీందర్‌లు పాల్గొని వాహన వినియోగదారులకు తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందజేత

పిట్టలవానిపాలెం, అక్టోబరు 1 : మండలంలోని నడిముల్లాయపాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త అనారోగ్యానికి గురికావటంతో చందోలు గ్రామ టీడీపీ యువనాయకుడు సయ్యద్ నిజాం మంగళవారం బాధితుడికి నిత్యావసర సరుకులు అందజేశారు.

రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి



రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయశాఖ ఏడీ విజయబాబు

రేపల్లె, అక్టోబరు 1 : రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించి పురుగుమందులు, ఎరువులను వాడుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ ఏడీ విజయబాబు అన్నారు. మండలంలోని బేతపూడి గ్రామంలో మంగళవారం జరిగిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతులు క్రిమిసంహారక మందులను ఎప్పుడు పడితే అప్పుడు వాడవద్దని గ్రామాల్లోని వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలను పాటించాలని ఆయ న తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఏ ఎ.వెంకటేశ్వర్లు, పంచాయతీ సెక్రటరీ అనుపమ, డిజిటల్ అసిస్టెంట్ ఎస్.హారిక, ఏఈవో తేజస్విని, పి.ప్రసాద్, రాయలబాబు, నాగపావని తదితరులు పాల్గొన్నారు.

● చుండూరు, అక్టోబరు 1 : రైతాంగం అవగాహన లోపంతో పంటలకు అధిక మోతాదులో ఎరువులు వినియోగించడం వలన నష్టం వాటిల్లడమే కాక ఆర్థికంగా రైతులు నష్టపోవాల్సి వస్తుందని జిల్లా రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్ తెలిపారు. దుండిపాలెం, యడ్లపల్లిలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి బండ్లమూడి ఆదాం, వ్యవసాయ శాఖ సిబ్బంది, మనిషీ ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

● వేమూరు, అక్టోబరు 1 : మండలంలోని చదలవాడ, కాకర్లమూడి గ్రామాల్లో మంగళవారం వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రైతులతో కలిసి వ్యవసాయ శాఖ సిబ్బంది క్షేత్రాలను సందర్శించారు. ఏవో సునీత మాట్లాడుతూ, వరి పంటలో సమగ్ర పోషక యాజమాన్యంలో మెలుకువలు పాటించాలని రైతులకు సూచించారు. చదలవాడ సర్పంచ్ దాసరి రమేష్‌బాబు, తెలుగు రైతు సంఘం నాయకులు అమ్మిశెట్టి కిషోర్‌బాబు, గ్రామ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ విజయ్, రైతులు పాల్గొన్నారు.

పర్యావరణానికి ప్లాస్టిక్‌తో పెనుముప్పు : సర్పంచ్

అమృతలూరు, అక్టోబరు 1 : ప్లాస్టిక్‌తో పర్యావరణానికి పెనుముప్పు అని సర్పంచ్ మండవ విజయలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని గోవాడలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా పీవీసీ జడ్పీ హైస్కూల్ విద్యార్థులు మంగళవారం స్వచ్ఛ భారత్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శివశంకరరావు, ఉప్పల సాంబశివరావు, మండవ రమేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడలకు పెరవలి విద్యార్థుల ఎంపిక

వేమూరు, అక్టోబరు 1 : నియోజకవర్గస్థాయిలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీలలో పెరవలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 బాల బాలికల విభాగంలో షార్ట్‌పుట్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలను పొందారు. డిస్కత్రో పోటీలో రెండవ స్థానాన్ని, 200 మీటర్ల పరుగు పందెంలో 3వ స్థానం, వాలీబాల్‌లో 2వ స్థానంలో నిలిచారు. చెస్ విభాగంలో ఇద్దరు ఎంపికయ్యారు. అండర్-17 బాల బాలికల విభాగంలో కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ విభాగంలో బాలబాలికలు ఎంపికయ్యారు. పాఠశాల ప్రాంగణంలో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను మంగళవారం ప్రధానోపాధ్యాయులు డి.సరోజిని అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు బుచ్చిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు పాల్గొని అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం సరోజిని

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి : ఎస్ఐ

వేమూరు, అక్టోబరు 1 : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్ఐ రవికృష్ణ సూచించారు. మండలంలోని జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 9, 10 తరగతుల విద్యార్థులకు క్రమశిక్షణ విధానంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు నరసింహస్వామి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎస్ఐ మాట్లాడుతూ, క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. సదస్సులో ఆపస్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసకుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు రవిరాజు, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు శివయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇంగ్లీషు భాషపై భయాన్ని వీడాలి

చెరుకుపల్లి, అక్టోబరు 1 : విద్యార్థులు ఇంగ్లీషుపై భయాన్ని వీడి భాషపై మక్కువ పెంచుకొని ముందుకు సాగాలని వనజ చంద్రపబ్లిక్ స్కూల్ డైరెక్టర్ జ్యోష్నా అన్నారు. భాషలో ప్రదర్శన ప్రయోగం అనే విభాగాలపై ఫెస్టివల్ కార్యక్రమంలో మంగళవారం ఆమె పాల్గొన్నారు. పలు పాఠశాలల నుంచి 100 మంది విద్యార్థులు పాల్గొని విద్యార్థులు రూపొందించిన వివిధ సాహిత్య వ్యాకరణాలను ఆంగ్లంలో ప్రదర్శించారు. ఉపాధ్యాయులు శ్వేత, శ్రీహరికృష్ణ, పలు పాఠశాలల అధ్యాపకులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

చెరుకుపల్లి, అక్టోబరు 1 : విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని గుళ్ళపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత అన్నారు. గుళ్ళపల్లి జడ్‌పీహెచ్ఎస్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల నుంచి గుళ్ళపల్లి, రాజవోలు విద్యార్థులు, ప్రైవేటు పాఠశాలలు వనజా చంద్రస్కూల్, హోలియర్ వరల్డ్ స్కూల్ టీమ్‌లు జిల్లా చెకుముకి పోటీలకు ఎంపికయ్యాయని తెలిపారు. గెలుపొందిన టీమ్‌లకు బహుమతులను తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు ఉప్పాల సాంబశివరావు బహుకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ సుభాని, జనవిజ్ఞాన వేదిక సభ్యులు కాటూరి నాగేశ్వరరావు, వాకా శ్రీనివాసరావు, కంచాల రామమోహన్‌రావు, మోర్ల లక్ష్మణ్, కె.లక్ష్మీనారాయణ, రాజవోలు, చింపిడి పార్థసారథి పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విధానం అమలులోకి తీసుకురావాలి

● పట్టణంలో ర్యాలీ నిర్వహించిన కార్మికులు



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

రేపల్లె, అక్టోబరు 1 : ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తక్షణమే ఉచిత ఇసుక అమలుల్లోకి తీసుకువచ్చి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు పి.నాగాంజనేయులు డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ఏఐటీయూసీ నాయకులు, భవననిర్మాణ కార్మికులు, అనుబంధ కార్మికులు మంగళవారం ర్యాలీ నిర్వహించి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇసుక హామీ అమలు చేయటంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. ఇసుక అందుబాటులోకి రాకపోవటంతో రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్మికులు లక్షలాదిమంది పనులు ఉపాధి కోల్పోయి పూటగడవక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా అధ్యక్షుడు జీ.శ్రీమన్నారాయణ, దాసరి శ్రీనివాసరావు, నాంచారయ్య, కాళిదాసు, తోట పూర్ణచంద్రరావు, కోటేశ్వరరావు, మధు, మొగదాసు, వివిధ కార్మికులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐగా శ్రీరామ్ ప్రసాద్



శ్రీరామ్‌ప్రసాద్

నగరం, అక్టోబరు 1 : తీరప్రాంతంలో నాటుసారా తయారుచేస్తే ఉపేక్షించేది లేదని నగరం ఎక్సైజ్ సీఐ శ్రీరామ్ ప్రసాద్ అన్నారు. నగరంలోని ఎక్సైజ్ కార్యాలయంలో నూతన సీఐగా శ్రీరామ్‌ప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో నరసరావుపేట ఎక్సైజ్ సీఐగా విధులు నిర్వహించారు. సాధారణ బదిలీలో భాగంగా నగరం సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన మద్యం పాలసీ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేస్తామని తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా క్రయవిక్రయాలు జరిగే విధంగా చర్యలు చేపడతామన్నారు. నాటుసారా, అక్రమ మద్యం అమ్మకాలు జరిగితే ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు పెసర్లంక విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు మహబూబ్ బాషా

భట్టిప్రోలు (కొల్లూరు), అక్టోబరు 1 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల ఎంపికలో మండల పరిధిలోని పెసర్లంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొంటున్నట్లు ప్రధానోపాధ్యాయుడు షేక్ మహబూబ్ బాషా మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ, ఎస్‌జీఎఫ్ క్రీడలలో భట్టిప్రోలు మండల స్థాయి అండర్-14, అండర్-17 విభాగాలలో కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్‌లలో విజేతలుగా నిలిచారని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులను అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయులు దాసరి వెంకటప్రసాద్, పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీల్లో సూరేపల్లి విద్యార్థినికి ద్వితీయ స్థానం



శనగపల్లి నవ్య

భట్టిప్రోలు (కొల్లూరు), అక్టోబరు 1 : జిల్లా స్థాయిలో జరిగిన వక్తృత్వ పోటీల్లో సూరేపల్లి విద్యార్థిని ద్వితీయ స్థానం సాధించింది. మండల పరిధిలోని సూరేపల్లి విపి అండ్ జిఎస్ఎం ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న శనగపల్లి నవ్య జిల్లా స్థాయిలో సేవ్ ది గరల్ చైల్డ్ అనే అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో ద్వితీయస్థానం సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కూచిబొట్ల శ్రీనివాసశర్మ మంగళవారం తెలిపారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో నవ్యను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు

భట్టిప్రోలు (కొల్లూరు), అక్టోబరు 1 : వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. భట్టిప్రోలు టిఎంరావు ఉన్నత పాఠశాలలో గత నెల 26న సత్యసాయి సేవా సంస్థలు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు పాఠశాల కరస్పాండెంట్ మల్లికార్జునరావు, హెచ్ఎం రామకోటేశ్వరరావు బహుమతులు పంపిణీ చేశారు. హెచ్ఎం మాట్లాడుతూ భగవంతుడు ఒక్కడే నా నిజమైన స్నేహితుడు అనే అంశంపై 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించడం జరిగిందన్నారు. 162 మంది విద్యార్థులు పోటీలో పాల్గొనగా విజేతలైన వారికి బహుమతులు ప్రదానం చేశామన్నారు. కార్యక్రమంలో బాలవికాస్‌సేవాదళ్ తూనుగుంట్ల శ్రీధర్, మానేపల్లి సుబ్బారావు, దివి రామకృష్ణ, ఎం.సత్యరత్న, లక్ష్మీపార్వతి, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

భట్టిప్రోలు (కొల్లూరు), అక్టోబరు 1 : మండల గ్రామం ఓలేరు శివారు పల్లెపాలెం పాఠశాల విద్యార్థులకు మంగళవారం పుస్తకాలు పంపిణీ చేశారు. ఎంఈవో దేవరాజ్ మాట్లాడుతూ జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి పార్థసారథి, కార్యదర్శి టి.లీలావతి ఆదేశాల మేరకు పల్లెపాలెం పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. రేపల్లె సీనియర్ సివిల్ కోర్టు జడ్జి టి.వెంకటేశ్వర్లు, సర్పంచ్ మేరుగ రంగారావు, హెచ్ఎం నరసింహారావు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన యడ్లపల్లి విద్యార్థులు

చుండూరు, అక్టోబరు 1 : రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్‌కు యడ్లపల్లి శ్రీ ఆలపాటి వెంకట్రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కుర్రా శ్రీనివాసరావు వెల్లడించారు. అండర్-17 విభాగంలో పెనుమాక గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో జోన్ స్థాయిలో జరిగిన పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థినులు వరుసగా బి.మేఘన 1500 పరుగులో మొదటి స్థానం, జి.మొనాలిక 3000 మీటర్ల పరుగులో మొదటి స్థానం, జి.దీపిక 400 మీటర్ల హర్డిల్స్ ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించి శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం తెలిపారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను విద్యా కమిటీ చైర్మన్ బయ్యా సతీష్, పీఈటీ వేమూరి శరత్‌బాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

3 నుంచి 13 వరకు దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు

కొల్లూరు, అక్టోబరు 1 : దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు ఈ నెల 3 నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు పార్వతీ అమ్మవారి దేవస్థాన కమిటీ ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొల్లూరు అనంత భోగేశ్వర, మల్లేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో ఉన్న పార్వతీ అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రులను పురస్కరించుకుని ఈనెల 3న స్వర్ణకవచాలంకృతదేవిగా, 4న బాలత్రిపురసుందరదేవిగా, 5న గాయత్రిదేవి, 6న అన్నపూర్ణాదేవి, 7న వైష్ణవిదేవి, 8న మహాగౌరిదేవి, 9న సరస్వతిదేవి, 10న శ్రీమహాదుర్గాదేవి, 11న ధనలక్ష్మీదేవి, 12న రాజరాజేశ్వరిదేవి, 13న పార్వతీ దేవిగా అలంకారంతో భక్తులకు అమ్మవారు దర్శనమివ్వనున్నారు. 9న సరస్వతీ పూజలో పాల్గొనే భక్తులు, విద్యార్థులు ఆలయంలో సంప్రదించాలని కమిటీ సభ్యులు కోరారు. నవరాత్రులను పురస్కరించుకుని వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

రేషన్ బియ్యం పట్టివేత

బాపట్ల, అక్టోబరు 1 : బాపట్ల మండలం వెదుళ్ళపల్లి గ్రామంలోని శ్రీ శ్రీనివాస అయ్యప్ప రైస్‌ట్రేడర్స్‌లో పౌరసరఫరాలశాఖాధికారులు మంగళవారం రాత్రి దాడులు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ ఓంకార్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌లు ఎ.అబ్రహం, కె.కిషోర్‌లు తనిఖీలు నిర్వహించగా 100 క్వింటాళ్ళ పీడీఎస్ బియ్యం, 134 క్వింటాళ్ళ నూకలు ఉన్నట్లు గుర్తించారు. వివరాలు నమోదు చేసుకొని 6ఎ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ తెలిపారు.

పేకాట స్థావరంపై వెదుళ్ళపల్లి పోలీసులు దాడి

బాపట్లరూరల్, అక్టోబరు 1 : పేకాట స్థావరంపై వెదుళ్ళపల్లి ఎస్ఐ పి.జనార్ధనరావు, సిబ్బంది మంగళవారం దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.3,800 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేయటం జరిగిందని తెలిపారు. స్టూవర్టుపురంలో ఓ కిరాణాషాపులో విక్రయిస్తున్న 17 బీరుబాటిళ్ళను స్వాధీనం చేసుకొని భోగిరి శివాజిని అదుపులోకి తీసుకున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కొండపి, అక్టోబరు 1 : మండలంలోని కట్టుబడివారిపాలెంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పనిచేస్తున్న జరుగుమల్లి మండలంలోని చిర్రికూరపాడు గ్రామానికి చెందిన ఇట్టా వెంకటేశ్వర్లు (46) ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మంగళవారం సాయంత్రం మరణించాడు. వెంకటేశ్వర్లు ప్రైవేటుగా విద్యుత్ పనులు చేస్తుంటాడని తెలిసింది. మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

నకిలీ డాక్యుమెంట్స్‌తో బ్యాంకు రుణం

పవర్ పట్టా ఉన్న వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు

టంగుటూరు, అక్టోబరు 1 : నకిలీ డాక్యుమెంట్స్ సృష్టించి రూ.3లక్షలు బ్యాంకు రుణం పొందాడు. అంతటితో ఆగని ఆతను మరో మహిళ పేరున ఇవే డాక్యుమెంట్స్ సృష్టించి బ్యాంకులో పెట్టి రుణం పొందేందుకు ప్రయత్నించాడు. అంతలో అసలు విషయం బయట పడింది. డాక్యుమెంట్స్ అన్నీ నకిలీవని, అసలు ఆ భూమి యజమాని అమెరికాలో నివాసం ఉంటాడని తేలింది. దీంతో అమెరికాలో ఉన్న భూయజమాని ఆ భూమి తాలూకా, పవర్ పట్టా రాసిచ్చిన వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకెళ్తే... మండలంలోని జమ్ముపాలెంలో నివాసం ఉండే ఓ వ్యక్తి గ్రామానికే చెంది అమెరికాలో ఉంటున్న వ్యక్తికి చెందిన భూమి కాజేసేందుకు ప్లాన్ వేశాడు. సుమారు 6.5 ఎకరాలకు నకిలీ డాక్యుమెంట్స్ సృష్టించి జాతీయ బ్యాంకులో పెట్టి 2022లో రూ.3లక్షలు రుణం తీసుకున్నాడు. తిరిగి ఆ భూమి మీద మరో నకలి డాక్యుమెంట్స్‌ను అదే గ్రామానికి చెందిన మహిళ పేరున సృష్టించి బ్యాంకులో పెద్ద మొత్తంలో రుణం తీసుకునేందుకు ప్రయత్నించారు. దీనిపై బ్యాంక్ సిబ్బంది ఆరా తీయగా అసలు విషయం బయటకొచ్చింది. ఆ భూమి ఆమెది కాదని తేలింది. దీంతో పవర్ పట్టా కలిగిన వ్యక్తి ఈ విషయం తెలుసుకుని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎస్సై నాగమల్లేశ్వరరావును వివరణ కోరగా సదరు పవర్ పట్టా హక్కు కలిగిన వ్యక్తి నుంచి ఫిర్యాదు వచ్చిందన్నారు. ఉన్నతాధికారులసలహాతో ముందుకెళ్తామని చెప్పారు.

భూముల ఫ్రీ హోల్డింగ్ పరిశీలనపై దృష్టి సారించాలి

● మంత్రి సత్యప్రసాద్

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 1: భూముల ఫ్రీ హోల్డింగ్ పరిశీలన ప్రక్రియను త్వరగా పూర్తి చేసేందుకు జిల్లా కలెక్టర్లు దృష్టి సారించాలని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్లతో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో సీసీఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియాతో కలిసి మంత్రి సత్య ప్రసాద్ మాట్లాడారు. భూముల ఫ్రీ హోల్డింగ్ పరిశీలన ప్రక్రియపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలు గడువులోపు పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో జరుగుతున్న భూముల ఫ్రీ హోల్డింగ్ వెరిఫికేషన్ ప్రక్రియ ఈనెలాఖరులోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పరిశీలన కోసం మండలాల వారీగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో జేసీ గోపాలకృష్ణ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డీఐజీ పుష్పలత, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ సభ్యుల సంఘం నూతన కార్యవర్గం

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 1: ఎంపీటీసీల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో మంగళవారం నేషనల్ లోకల్ గవర్నమెంట్స్ ఛాంబర్ ప్రధానకార్యదర్శి జి.వీరభద్రాచారి అధ్యక్షతన కార్యవర్గం ఎన్నికల జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఆకుపాటి వెంకటేశ్వర్లు(పామూరు), ప్రధాన కార్యదర్శిగా ఆర్.వెంకట్రావు(కొత్తపట్నం), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నన్నెబోయిన రవికుమార్(అర్ధవీడు), ఉపాధ్యక్షులుగామన్నం కృష్ణ కిషోర్(మద్దిపాడు), పి నాగేశ్వరరావు, కార్యదర్శిగా శాంతారావు(ఆల్లూరు)లను ఎన్నుకున్నారు. సభ్యులుగా ఎం. చిన్నపుల్లమ్మ, రాఘవరెడ్డి, నాగభూషణంలను ఎన్నుకున్నారు.

ప్రతిభ చాటిన గాయత్రి, పావని



ధ్రువీకరణపత్రాలతో విద్యార్థినులు

పంగులూరు, అక్టోబరు 1 : జిల్లా స్థాయి పోటీలలో చందలూరు, బూదవాడ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థినులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ఈనెల 11న అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ జిల్లా స్థాయిలో సేవ్ ది గర్ల్ చైల్డ్ అనే అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీలో చందలూరు జడ్పీ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థిని చల్లా గాయత్రి ప్రథమ స్థానం సాధించింది. ఇదే అంశంపై జరిగిన వ్యాసరచన పోటీలో బూదవాడ జడ్పీ ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థిని గొల్ల వెంకట పావని సాయి ప్రజ్ఞ ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ నెల 11న కలెక్టర్, డీఎంహెచ్‌వో చేతుల మీదుగా గాయత్రికి రూ.5వేలు, పావనికి రూ.3వేల నగదు బహుమతిని అందుకోనున్నారు. ప్రతిభ చాటిన ఈ బాలికలకు నిర్వాహకులు ధ్రువీకరణపత్రాలను అందజేశారు. హెచ్‌ఎంలు గిరిజ, బంగారుకొండ, ఉపాధ్యాయులు అభినందించారు.

తమ్ముళ్ల జీరో దందా

గ్రానైట్ రవాణాలో కొందరు చేతివాటం

రోజుకు రూ.15లక్షలు, నెలకు రూ.4.50 కోట్లు

అధికారులకు మామూళ్లు, ఇతరత్రా ఖర్చులు పోను

వారి జేబుల్లోకి సగం డబ్బు

ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి

ముగ్గురు ఎమ్మెల్యేల అనుచరులు నాయకత్వం

> ప్రభుత్వం మారగానే చీమకుర్తి ప్రాంత గ్రానైట్ పరిశ్రమల్లో అప్పటి వరకూ దందాలు చేసిన జగన్ గ్యాంగ్ పరారైంది. అధికారం అండతో అటు క్వారీలు, ఇటు పాలిషింగ్ యూనిట్లపై పెత్తనం చేసి భారీగా సొమ్ము చేసుకున్న కడప ముఠా ఉడాయించింది. స్థానిక వైసీపీ నేతలు కూడా అక్రమ రవాణా, ఇతరత్రా కార్యకలాపాలకు ఫుల్‌స్టాప్ పెట్టారు.
>
> అయితే ఆస్థాయిలో కాకపోయినా అదేతరహా దందాకు తెలుగు తమ్ముళ్లు శ్రీకారం పలికారు. ఒక ఎమ్మెల్యే అనుచరుల సారథ్యంలో ఈ వ్యవహారం సాగుతోంది. మరో ఇద్దరు ఎమ్మెల్యేల అనుచరులు అందులో భాగస్వామ్యం అయ్యారు. ప్రభుత్వానికి ఎలాంటి పన్నులు చెల్లించకుండా దొడ్డిదారిన గ్రానైట్ రవాణా చేస్తున్నారు. రోజుకు రూ.15లక్షల ప్రకారం నెలకు రూ.4.50 కోట్ల ఆదాయం పొందుతున్నారు. అందులో ఆయా శాఖల అధికారులకు ఇచ్చే మామూళ్లు, నిర్వహణ ఖర్చుల కింద సగం పోయినా మిగతాది ఆయా వ్యక్తుల జేబుల్లోకి వెళ్తోంది.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

గ్రానైట్ పరిశ్రమ గత జగన్ ప్రభుత్వ హయాంలో కునారిల్లింది. ప్రభుత్వ పారిశ్రామిక విధానాలు ఫ్యాక్టరీలను దెబ్బతీశాయి. అదేసమయంలో జగన్ బృందం, స్థానిక వైసీపీ నేతల అనుచరుల నిర్వాకంతో ప్రభుత్వ ఆదాయం భారీగా తగ్గింది. కూటమి సర్కారు అధికారంలోకి రాగానే ఆశాజనకమైన వాతావరణం నెలకొంది. అటు గ్రానైట్ క్వారీలు, ఇటు పాలిషింగ్ యూనిట్ల యజమానులు ఉత్పత్తి పెంపుదలకు పోటీపడ్డారు. అయితే ప్రభుత్వం ఇంతవరకూ గ్రానైట్ పరిశ్రమకు సంబంధించి స్పష్టమైన నిర్ణయాలు తీసుకోలేదు. గత ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలను నిగ్గుతేల్చే విషయం కూడా ప్రారంభ దశలోనే ఉంది. అయితే ఇంతలోనే జిల్లాలో తెలుగు తమ్ముళ్లు జీరో దందాకు తెరతీశారు.

నిబంధనల ప్రకారం చేయాల్సింది ఇలా..

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గెలాక్సీ గ్రానైట్ అనుబంధంగా చిన్నతరహా పరిశ్రమలు (పాలిషింగ్ యూనిట్లు) చీమకుర్తి సమీప ప్రాంతాల్లో భారీగా వెలిశాయి. క్వారీల్లో లభించే ఎగుమతి కాని రాయిని స్థానిక ఫ్యాక్టరీల వారు కొనుగోలు చేసి వాటిని వివిధ సైజుల్లో పాలిష్ చేసి విదేశాలకు ఎగు... తి చేస్తారు. అంతకన్నా అధికంగా దేశంలోని వివిధ రాష్ట్రాల్లో డీలర్లకు సరఫరా చేస్తారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక్కో కంటైనర్ ద్వారా నాలుగు వేల అడుగులకు పైబడిన పాలిషింగ్ రాయిని వారు రవాణా చేస్తారు. నిబంధనలకు అనుగుణంగా వారు వ్యాపారం చేస్తే స్వదేశంలో అమ్ముకునే గ్రానైట్‌కు సంబంధించి ఒక కంటైనర్‌కు రూ.54వేలు ప్రభుత్వానికి రాయల్టీ, జీఎస్టీ కింద చెల్లించాలి. విదేశాలకు ఎగుమతి చేసే కంటైనర్‌కు అయితే రాయల్టీ, అతి తక్కువ జీఎస్టీతో సుమారు రూ.32వేలు కట్టాలి. అయితే అవేమీ చెల్లించకుండా సరుకును ఎగుమతి చేసుకుంటే వారికి భారీగా మిగులుతుంది. అందుకు వారికి మైనింగ్, పోలీసు, వృత్తిపన్ను శాఖల అధికారుల నుంచి సహకారం అవసరం.



కంటైనర్లలో తరలిపోతున్న గ్రానైట్ రాళ్లు

దారికాచి వసూళ్లు

విదేశాలకు ఎగుమతి చేసే గ్రానైట్‌ను జిల్లా నుంచి జాతీయ రహదారి ద్వారా కృష్ణపట్నం పోర్టుకు తరలిస్తారు. స్వదేశంలో వివిధ నగరాలకు వెళ్లే గ్రానైట్‌ను అటు పొదిలి, మరోవైపు తూర్పుగంగవరం అడపాదడపా ఇతర మార్గాల ద్వారా చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లాంటి నగరాలకు రవాణా చేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టి అక్రమంగా గ్రానైట్‌ను తరలించాలంటే రాజకీయ సహకారం తప్పనిసరి. అక్కడే అధికార పార్టీ ప్రజాప్రతినిధుల అనుచరులు రంగంలోకి వస్తారు. ప్రస్తుతం టీడీపీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేల అనుచరులు రంగంలోకి దిగారు. ప్రధానంగా పార్టీలో కూడా సీనియర్ ఒక సీనియర్ ఎమ్మెల్యే అనుచరులు ఇద్దరు ఈ వసూళ్ల ముఠాకు నాయకత్వం వహిస్తున్నారు. వారిలో ఒంగోలులోని ఒక కార్పొరేటర్, చీమకుర్తి ప్రాంతానికి చెందిన ఒక క్రషర్ వ్యాపారి ఉన్నారు. వీరు మొత్తం 30 మందితో ఒక ముఠాను నడుపుతున్నారు. ఆ ఇద్దరూ సదరు ఎమ్మెల్యే కనుసన్నల్లో ఉండే అనుచరులే. అలాగే ఈ గ్రానైట్ ప్రధాన భాగం ఒంగోలుతో కలిసి ఉండే మరో అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఉంది. స్వదేశంలో అమ్మకానికి వెళ్లే గ్రానైట్ లారీలు ఎక్కువగా వెళ్లే మార్గం పశ్చిమప్రాంతానికి చెందిన మరో నియోజకవర్గ పరిధిలో ఉంది. దీంతో ఆ ఇద్దరు వ్యక్తుల సారథ్యంలో ముగ్గురు ఎమ్మెల్యేల అనుచరులు కలిసి ఆయా రహదారుల్లో తిష్టవేసి బలవంతంగా వసూళ్ల కార్యక్రమం చేపట్టారు.

ఎదురుతిరిగిన వ్యాపారులు

ఈ అక్రమ వ్యవహారంతో సంబంధం లేకుండా చట్టప్రకారం బిల్లులు చెల్లించే కొద్దిమంది వ్యాపారుల్లో ఒకరిద్దరు ఇటీవల తెలుగు తమ్ముళ్లకు ఎదురుతిరిగారు. ఒక వ్యాపారి అన్ని బిల్లులతో తాను గ్రానైట్ సరఫరా చేస్తున్నానని, మామూళ్లు ఇవ్వనని తేల్చి చెప్పారు. ఈ విషయమై దందా రాయుళ్లు పవర్ వినియోగించి సదరు కంటైనర్‌ను పొదిలి పోలీస్ స్టేషన్‌కు చేర్చారు. రెండురోజులపాటు రాజీ ప్రయత్నం చేసి అక్కడ పోలీసు అధికారులు వసూల్ రాజాలకు అనుగుణంగా సదరు వ్యాపారిపై ఒత్తిడి తెచ్చారు. విషయం మొత్తం ఒక్కసారిగా గప్పుమని తమ్ముళ్ల జీరో వ్యవహారంపై గ్రానైట్ పరిశ్రమలో చర్చ నెలకొంది. దీంతో వైసీపీ ప్రభుత్వ అవలక్షణాలనే కూటమి ప్రభుత్వంలోనే కొనసాగిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

ప్రభుత్వాదాయానికి భారీగా గండి

చీమకుర్తి, బూదవాడ, మర్రిచెట్లపాలెం, సంతనూతలపాడు, గ్రోత్ సెంటర్ తదితర ప్రాంతాల నుంచి రోజువారీ 100 నుంచి 150 కంటైనర్లలో గ్రానైట్ ఎగుమతి అవుతుంది. అందులో స్వదేశంలో వినియోగానికి అవసరమైన గ్రానైట్ ఎగుమతి చేసే కంటైనర్లు 80 వరకూ ఉంటే, విదేశాలకు ఎగుమతి చేసే కంటైనర్లు 20వరకూ ఉంటాయి. ఎలాంటి జీఎస్టీ చెల్లించకుండా ఎల్లలు దాటించేందుకు సరాసరిన ప్రతి కంటైనర్ నుంచి రూ.15 వేలు తెలుగు తమ్ముళ్లు వసూలు చేస్తున్నారు. అలా 100 లారీలపై రోజుకు రూ.15 లక్షల ప్రకారం నెలకు రూ.4.50 కోట్లు వసూలు చేస్తున్నారు. ఎలాంటి బిల్లులు లేకుండా ఈ గ్రానైట్ రవాణా చేయడం ద్వారా ఒక్కో కంటైనర్‌పై యజమానికి రూ.40వేలు మిగులుతుండగా ఆమేర ప్రభుత్వ ఆదాయం తగ్గుతోంది. ఒక అంచనా ప్రకారం రోజుకు రూ.15లక్షలు జీరో ముఠా జేబుల్లోకి వెళ్తుంటే రూ.40లక్షలు ప్రభుత్వ ఖజానాకు గండిపడుతోంది. రోజుకు రూ.15లక్షల ప్రకారం నెలకు రూ.4.50 కోట్లు తెలుగు తమ్ముళ్లు వసూలు చేస్తున్నారు. ఇందులో మైనింగ్, పోలీసు, వృత్తి పన్ను శాఖల అధికారులకు కొంతవరకూ మామూళ్లు చెల్లిస్తున్నారు. దానికితోడు అధికార పార్టీ ఎమ్మెల్యేల ఆశీస్సులు ఉండటంతో అధికారులు పచ్చజెండా ఊపుతున్నారు. ఇలా నెలవారీ వసూళ్లు చేసే రూ.4.50 కోట్లలో ఆయా శాఖలకు ఇచ్చే మామూళ్లు, వసూళ్లు చేసే వారికి ఇచ్చే జీతాలు, ఇతర ఖర్చులు రూ.2.5కోట్లు పోయినా నిర్వాహకులకు నెలవారీ రూ.2కోట్లు మిగులుతుందని అంచనా. అంత మొత్తం ముగ్గురు ఎమ్మెల్యేల అనుచరుల జేబుల్లోకి వెళ్తోంది.

మంచంపట్టిన కోయవారిపాలెం

విజృంభించిన విష జ్వరాలు

ఒకే ఇంట్లో ఇద్దరు

ముగ్గురు బాధితులు

కొందరికి గున్యా లక్షణాలు

పట్టించుకోని వైద్యాధికారులు



జ్వరాల బారిన పడ్డ శ్రీదేవి, భర్త బ్రహ్మయ్య, సుమతి

కొండపి, అక్టోబరు 1 : మండలంలోని పెట్లూరు పంచాయతీ పరిధి కోయవారిపాలెంలో విష జ్వరాలు విజృంభించాయి. ఇంటికి ఇద్దరు ముగ్గురు మంచం పట్టారు. వారం రోజులుగా ప్రజలు అల్లాడుతున్నా వైద్యారోగ్యశాఖ అధికారులు పట్టించుకోలేదు. ఇప్పటికే వంద మందికిపైగా జ్వరాల బారిన పడ్డారు. కొందరిలో గున్యా లక్షణాలు కన్పిస్తున్నాయి. కాళ్లూచేతులూ కదపలేకపోతున్నారు. ఒకే కుటుంబానికి చెందిన పొతకమూరి కోటమ్మ, నారాయణ, రాజా గున్యాతో బాధపడుతున్నారు. ఇంకో ఇంట్లో సుమతి, ఆమె భర్త సిద్ధయ్య, మరో ఇంట్లో శ్రీదేవి, ఆమె భర్త బ్రహ్మయ్య, అత్త తులశమ్మ జ్వరాల బారిన పడ్డారు. గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త పరిటాల సులోచన ఒంగోలు వైద్యశాలలో చేరి ఐదు రోజులుగా చికిత్స పొందుతున్నారు. ఇలాగే చాలా మంది అటు జ్వరాలు, ఇటు గున్యాతో బాధపడుతున్నారు. కొందరు ఆర్‌ఎంపీ వైద్యుల వద్ద చికిత్స పొందుతుండగా, మరికొందరు కొండపి, ఒంగోలుల్లోని ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరి వైద్యం చేయించుకుంటున్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి



గ్రామంలో 150 ఇళ్లు ఉన్నాయి. దాదాపు 650 మంది జనాభా ఉంది. ఓసీ, ఎస్సీ అన్ని కాలనీల్లో జ్వరాలు, గున్యాతో దాదాపు 150 మందికిపైగా బాధపడుతున్నారు. నాకు కూడా జ్వరంగా ఉండటంతో మందులు వాడుతున్నాను. వైద్యారోగ్యశాఖ అధికారులు గ్రామంలో వెంటనే వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి.

కొల్లూరి రవి, కోయవారిపాలెం

దసరాకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

హైదరాబాద్ నుంచి 136 సర్వీసులు

సాధారణ చార్జీలే వసూలు

ఆర్‌ఎం సుధాకర్‌బాబు

ఒంగోలు (కార్పొరేషన్), అక్టోబరు 1 : దసరా సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు సంస్థ రీజనల్ మేనేజరు బి.సుధాకర్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నుంచి 136, బెంగళూరు నుంచి 8, చెన్నై నుంచి ఐదు సర్వీసులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో ఏసీ స్లీపర్, నాన్ ఏసీ స్లీపర్ ఉంటాయన్నారు. ఇవి ఈనెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ నడుస్తాయన్నారు. సాధారణ రోజుల్లో మాదిరిగానే చార్జీలను వసూలు చేస్తామన్నారు. ప్రయాణికుల కోసం ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. రాను, పోను ఒకేసారి రిజర్వేషన్ చేసుకున్న వారికి చార్జీ మొత్తంలో పది శాతం రాయితీ లభిస్తుందన్నారు.

90 శాతం రాయితీపై మినీ గోకులం షెడ్లు

నాగులుప్పలపాడు, అక్టోబరు 1 : పశుపోషకులకు ప్రభుత్వం 90శాతం రాయితీపై అందిస్తున్న మినీ గోకులం షెడ్ల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ జేడీఏ బేబీరాణి సూచించారు. నాగులుప్పలపాడు, పోతవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీఏ మాట్లాడుతూ సంపూర్ణ మిశ్రమ దాణాను సబ్సిడీపై అందిస్తున్నామని, పశువుల బీమాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏవో వెంకట్రావు మాట్లాడుతూ రైతులు ప్రతి మూడేళ్లకోసారి తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈనెల 15 నుంచి 25శాతం సబ్సిడీపై శనగ విత్తనాలు పంపిణీ చేస్తామని తెలిపారు. సబ్సిడీ పోను కిలో జేజే-11 రకం రూ.70.50, కాగ్-2 రకం రూ.90.75 చెల్లించి పొందాలని చెప్పారు. శనగలో ఎండు తెగులు రాకుండా కేజీకి 8 గ్రాములు ట్రైకోడెర్మావిరిడితో విత్తన శుద్ధి చేయాలన్నారు. అనంతరం రైతులు సాగు చూసిన మొక్కజొన్న పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేకుండా చూడండి

అధికారులను ఆదేశించిన మంత్రి గొట్టిపాటి



ప్రజా సమస్యలపై సమీక్షిస్తున్న మంత్రి గొట్టిపాటి

పంగులూరు, అక్టోబరు 1 : పంటల సాగులో రైతులకు ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ప్రజా సమస్యలను తెలుసుకున్న ఆయన అధికారులు, నేతలతో సమీక్ష నిర్వహించారు. డీఏపీ ఎరువు తగినంత అందుబాటులో లేక ఇబ్బంది పడుతున్నామని రైతులు మంత్రి దృష్టికి తెచ్చారు. దీనిపై ఏవో సుబ్బారెడ్డిని డీఏపీ కొరత దేనికని ప్రశ్నించారు. ఎరువులు రూ.1300లకు మించి అమ్మవద్దని నిబంధన ఉండడంతో వ్యాపారులు అమ్మేందుకు ఆసక్తి చూపడంలేదని చెప్పారు. ఈ కారణంగానే ఎరువుల కొరత ఏర్పడిందని తెలిపారు. వెంటనే మంత్రి జిల్లా అధికారులతో మాట్లాడి డీఏపీ కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. అవసరమైతే సొసైటీల ద్వారా, రైతు సేవా కేంద్రాల ద్వారా డీఏపీని అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. పొగాకు, మిరప నాట్లు వేసే రైతులు సాగు నీరందక ఇబ్బంది పడుతున్న విషయాన్ని నాయకులు గొట్టిపాటి దృష్టికి తెచ్చారు. వెంటనే మంత్రి ఎన్ఎస్పీ ఎస్ఈతో మాట్లాడాలని అధికారులకు సూచించారు. రోడ్లు అధ్వానంగా ఉన్నాయని కొప్పెరపాడు పరిసర గ్రామ ప్రజలు మంత్రికి వివరించగా, ముప్పవరం -పంగులూరు ప్రధాన రహదారి బాగులేదని, నిధుల కొరతతో రోడ్ల నిర్మాణం నిలిచిందని, నిధులు సమకూరగానే నియోజకవర్గంలో బాగాలేని రోడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. గృహ నిర్మాణంపై మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులకు రూపాయి, పది రూపాయలు జమ అయిన వారికి బిల్లుల చెల్లింపునకు వివరాలు ఇవ్వాలని హౌసింగ్ ఏఈ కిషోర్‌ను ఆదేశించారు. పశువుల షెడ్ల విషయమై అలవలపాడు రైతులు ప్రస్తావించగా మండలానికి 27 షెడ్లు వచ్చాయని, జిల్లా అధికారుల ద్వారా మరో 50 షెడ్లను రప్పించి అన్ని గ్రామాలకు అందజేస్తామన్నారు. ప్రజల ద్వారా వచ్చిన సమస్యల పరిష్కారంపై అధికారులకు మంత్రి సూచనలు చేశారు. సమావేశంలో చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, ప్రత్యేకాధికారి రాజేష్‌కుమార్, తహసీల్దార్ నాగరాజారావు, ఎంపీడీవో రామాంజనేయులు, కేవీ సుబ్బారావు, బాచిన చెంచుప్రసాద్, డెయిరీ మాజీ చైర్మన్ బాలిన రామసుబ్బారావు, టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, గుర్రం ఆదిశేఖర్, షేక్ మస్తాన్‌వలి, బొరెడ్డి ఓబుల్‌రెడ్డి, ఎర్రం శ్రీనివాసరెడ్డి, గరిమిడి జగన్మోహన్‌రావు, పూనాటి రామాంజనేయులు, గొల్లపూడి అంజయ్య, గుదిబండ్ల ఆదిరెడ్డి, స్వామి, వరపర్ల సుబ్బారావు, కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, గొట్టిపాటి కాజా, రామలింగస్వామి, ఉన్నం రవి, భానుప్రకాశ్, నార్నె సుబ్బారావు, శ్రీకాంత్, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ఏడాదిలో హామీలన్నీ నెరవేరుస్తాం

దీపావళికి ఉచిత గ్యాస్

వృద్ధులకు వైద్య సదుపాయం

మంత్రి స్వామి



మాట్లాడుతున్న మంత్రి స్వామి

టంగుటూరు, అక్టోబర్ 1 : ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలన్నింటినీ ఈ ఆర్థిక సంవత్సరంలోనే నెరవేరుస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి తెలిపారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. మండలంలోని సూరారెడ్డిపాలెం, వల్లూరు ఎస్సీ కాలనీలో మంగళవారం నిర్వహించిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం నెలకు రూ.3వేలు పింఛన్ కేవలం మూడు నెలలు మాత్రమే ఇచ్చిందని, కూటమి ప్రభుత్వం వచ్చీరాగానే రూ.4వేలకు పెంచిందన్నారు. దివ్యాంగులకు రూ.3వేల నుంచి రూ.6వేలు చేసిందన్నారు. మంచంలో ఉండే వారికి రూ.15వేలు పింఛన్ చెల్లిస్తున్నట్లు మంత్రి వివరించారు. 2017లో టీడీపీ ప్రభుత్వంలోనే డప్పు కళాకారులకు, చర్మకారులకు పింఛన్లు మంజూరు చేసిందని గుర్తు చేశారు. 70 ఏళ్ల వయసు దాటిన వృద్ధులకు త్వరలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేసి ఉచిత వైద్యం అందించనున్నట్లు చెప్పారు. 1వ తేదీ నాడే ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామన్నారు. 1వతేదీ సెలవు దినమైతే ముందు రోజునే పింఛన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. సూరారెడ్డిపాలెంలో సర్పంచ్ శైలిషా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మొలకలపల్లి కోటేశ్వరరావు, సాంఘిక సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్, వల్లూరులో టీడీపీ నాయకులు బొజ్జా శ్రీనివాసరావు, సుమన్, పవన్‌కుమార్, గోపి, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు. పింఛన్ల పంపిణీ అనంతరం కొందరు లబ్ధిదారుల గృహాలకు వెళ్లి పరిశీలించారు. ఇళ్లు ఎప్పుడు నిర్మించుకున్నారు? ఇప్పుడు పరిస్థితి ఏమిటి? ప్రభుత్వం సాయం అందిస్తే ఇళ్లు నిర్మించుకుంటారా? అని వారిని అడిగి తెలుసుకున్నారు.

విచారణకు ఆదేశిస్తే స్వాగతిస్తాం

టంగుటూరు : తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ వివాదంపై విచారణకు సుప్రీంకోర్టు కేంద్ర దర్యాప్తు సంస్థను ఆదేశిస్తే స్వాగతిస్తామని రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. పింఛన్ల పంపిణీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ వివాదంలో సుప్రీంకోర్టు సోమవారం చేసిన వ్యాఖ్యలు కేవలం ప్రాథమిక స్థాయిలోనివేనన్నారు. న్యాయవ్యవస్థపై టీడీపీకి అపారమైన గౌరవం, నమ్మకం ఉన్నదన్నారు. ప్రస్తుతం జరుగుతున్న దర్యాప్తు ద్వారా నిజానిజాలన్నీ వెలుగు చూస్తాయని, దోషులు తప్పక శిక్షించబడతారని స్వామి వ్యాఖ్యానించారు.

96 శాతం పింఛన్ల పంపిణీ

సింగరాయకొండ : మండలంలో 96శాతం మంది లబ్ధిదారులకు మంగళవారం సామాజిక పింఛన్‌లు పంపిణీ చేశారు. పది గ్రామాల్లో 9,132 మంది లబ్ధిదారులుండగా 8,741 మందికి నగదును అందజేశారు. మూలగుంటపాడు పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో డి.జయమణి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కొప్పోలు రామారావు టీడీపీ నేతలు సన్నెబోయిన శ్రీనివాసులు, చిగురుపాటి గిరి, గుదే వెంకటేశ్వర్లు, సన్నెబోయిన మల్లికార్జున, అంబటి శ్రీను, వర్మ పాల్గొన్నారు.

రాతి ముఖ మండపానికి రూ.లక్ష విరాళం

అద్దంకిటౌన్, అక్టోబరు 1 : శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో నూతనంగా నిర్మిస్తున్న దేవస్థానం రాతి ముఖ మండపానికి దాతలు విరాళాలను అందజేసినట్లు ఆలయ ఈవో ఎం.తిమ్మానాయుడు తెలిపారు. మంగళవారం అద్దంకి చెందిన మోదడుగు వెంకటేశ్వరరావు, సునీత దంపతులు రాతి ముఖ మండపానికి రూ.1,00116 విరాళంగా అందజేయడం జరిగిందని ఆయన తెలిపారు.

జనసేన నేత విజయ్‌కుమార్‌కు డాక్టరేట్




విజయ్‌కుమార్‌కు వర్సిటీ కులపతి నర్సింహారెడ్డి

పర్చూరు, అక్టోబరు 1 : జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్చూరు పెద్దపూడి విజయ్‌కుమార్ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని కేంద్రీయ విశ్వవిద్యాలయం కులపతి జస్టిస్ నర్సింహారెడ్డి చేతుల మీదుగా విజయ్‌కుమార్ ప్రశంసాపత్రం అందుకున్నారు. రాజనీతి శాస్త్రం విభాగం నుంచి సంక్షేమ రాజ్యం, దళితుల విద్య - ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ పాత్ర అంశంపై పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈసందర్భంగా విజయ్ కుమార్‌ను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, జనసేన పార్టీ శ్రేణు లు, రాజకీయ నేతుల, ప్రజలు అభినందనలు తెలిపారు.

ముఖ మండప నిర్మాణంపై దృష్టి

» శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో పనులు ప్రారంభించి రెండేళ్లు » మరో నాలుగు నెలల్లో పూర్తికి కసరత్తు

అద్దంకి, అక్టోబరు 1 : శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం రాతి మండపం నిర్మాణ పనుల వేగవంతంపై అధికారులు దృష్టి సారించారు. మరో 4 నెలలలో పూర్తి చేసి తిరునాళ్ల నాటికి కొత్త ఆలయంలో స్వామి వారి దర్శనం కలిగించేలా అధికారులు కసరత్తు చేపట్టారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి మండప నిర్మాణానికి సుమారు రూ.6కోట్ల అంచనాతో పనులు ప్రారంభించారు. ఇందులో రూ.2 కోట్లు టీటీడీ నుంచి, రూ.2కోట్లు ప్రభుత్వం నుంచి మంజూరు కాగా, మిగిలిన రూ.2కోట్లు దాతల నుంచి సేకరిస్తున్నారు. మరో రూ.కోటితో అదనపు పనులు చేసేందుకు కూడా టీటీడీ నుంచి నిధుల మంజూరుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. 2022 జూన్ 4వ తేదీన అప్పటి టీటీడీ చైర్మన్ గా ఉన్న వైవీ సుబ్బారెడ్డి శంకుస్థాపన చేశారు. అప్పట్లోనే టెండర్ల ప్రక్రియ ఆలస్యం కావడం, ఈవో, పాలక మండలి మధ్య విభేదాల నేపథ్యంలో సుమారు 6 నెలలపాటు పనులు ప్రారంభం కాలేదు. ఈవోగా సుభ ద్ర బాధ్యతలు తీసుకున్న తరువాత ఏడాదిన్నర కిందట పనులు ప్రారంభించారు. తొలిదశలో పనులు ఒకింత వేగవంతంగా జరిగినప్పటికీ తర్వాత నత్తనడకన సాగాయి. దీంతో గత అక్టోబర్‌లో పనులు పూర్తి చేయాలనుకున్నా ఆలస్యం అయింది. రాతి ముఖ మండప నిర్మాణ ప్రతిపాదనలు సిద్ధం చేసి బదిలీపై వెళ్లిన అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు ఇటీవల తిరిగి శింగరకొండ అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో రాతి మండప నిర్మాణ పనులు వేగవంతం చేసే ప్రక్రియపై దృష్టి సారించారు. ఇప్పటికే కాంట్రాక్టర్, కూలీలతో చర్చించారు. కూలీలను అదనంగా ఏర్పాటు చేసి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని తిమ్మానాయుడు సూచించారు. ఫిబ్రవరి నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని కోరారు. తిరునాళ్ల సమయానికి పూర్తి చేసే లక్ష్యంతో ముందుకుసాగుతున్నారు.



ఏర్పాటు చేసిన రాతి స్తంభాలు

4 నెలలలో రాతి మండపం పూర్తి

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ రాతి మండప నిర్మాణ పనులు మరో 4నెలలలో పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉన్నాం. అదనంగా కూలీలను ఏర్పాటు చేసి పనులు వేగవంతం చేయాలని కాం ట్రాక్టర్‌కు చెప్పాం. వచ్చే వార్షిక తిరునాళ్లకు పాత ఆలయంలో భక్తులకు స్వామి వారి దర్శనం కల్పిస్తాం.

- తిమ్మానాయుడు, అసిస్టెంట్ కమిషనర్, శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం.


పరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

అద్దంకిటౌన్, అక్టోబరు 1 : సమతుల ఎరువులు, యాజమాన్య పద్ధతులు పాటిస్తే నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త జె. రాధాకృష్ణ సూచించారు. మంగళవారం మండలంలోని చిన్నకొత్తపల్లి గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సాగులో ఉన్న వరి పంటలను అధికారులు పరిశీలించారు. అనంతరం సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో శాస్త్రవేత్త రాధాకృష్ణ మాట్లాడుతూ యూరియా అధికంగా వాడడం వలన చీడపీడలు ఎక్కువగా వస్తాయని, యూరియా, పొటాష్ ఎకరాకు 20 కేజీలు వేసుకోవాలన్నారు. బిందు, తుంపర సేద్య పరికరాలు రాయితీపై అందుస్తున్నట్లు ఉద్యాన అధికారి ఎస్.దీప్తి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, వీపీఏ ఆజాద్, మాకినేని ఏడుకొండలు, సాంబశివరావు, పాల్గొన్నారు.

బల్లికురవ : రైతులంతా పంటల సాగులో మెలకువలను పా టిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించ వచ్చని మండల వ్యవసాయ శాఖ ఏవో కుమారి తెలిపారు. మంగళవారం మండలంలోని కొణిదెన, రాజుపాలెం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో పత్తి పంటను పరిశీలించి, రైతులకు అవగాహన కల్పించారు. రసం పీల్చే పురుగు అధికంగా ఉందని, అప్రమత్తంగా ఉండి పురుగు మందులను పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

చినగంజాం : చింతగుంపల్లి, కడవకుదురు గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సర్పంచ్‌లు యార్లగడ్డ సత్యనారాయణ, గొల్లమూరి శివకుమారి అధ్యక్షతన జరిగిన సభల్లో జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు టి.రత్నకుమారి మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి కే.భాస్కరరావు, ఉద్యాన శాఖాధికారి పి.అలేఖ్య, మార్కెటింగ్ శాఖాధికారి ఎన్.ఖాజావలి, వీపీఏలు వై.సంధ్య, బి.కిషోర్, డి.దీవేనా, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పర్చూరు : రైతులకు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించి తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులను సాధించాలన్న సంకల్పంతో ప్రభుత్వం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని వ్యవసాయ సంహాయ సంచాలకులు ఎన్.మోహనరావు అన్నారు. మంగళవారం వ్యవసాయ మార్కెట్ యార్డు, ఉప్పుటూరు గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ సూపర్‌వైజర్ అరుణ, మండలపార్టీ అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, నాయకులు కొల్లా శివరాం ప్రసాద్, టి.మల్లికార్జునరావు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

మేదరమెట్ల : అపరాల పంటలలో సరైన సస్యరక్షణ పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని డాట్ శాస్త్రవేత్త రాధాకృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలోని తిమ్మానపాలెం, యర్రబాలెం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఏడీఏ ధనరాజ్, డాట్ శాస్త్రవేత్త రాధాకృష్ణ, ఏవో శ్రీనివాసరావు పాల్గొన్నారు. సస్య రక్షణ, మెలకువలను తెలిపారు. కార్యక్రమంలో వీపీఏ షరీఫ్, వీహెచ్‌ఏ సాహితి, ఏఎంసీ సూపర్‌వైజర్, రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పంగులూరు : మండలంలోని కోటపాడు, కొండమంజులూరు గ్రామంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులతో వరి పైరును ఏవో సుబ్బారెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు చింతల సహదేవుడు, బత్తుల వెంకటరావు, నాగేశ్వరరావు, మస్తాన్‌రావు, ఏఈవో కోటేశ్వరరావు, వ్యవసాయ సహాయకులు శైలేష్, అక్షరాణి, రైతులు పాల్గొన్నారు.

ఇంకొల్లు : శనగ సాగు చేసే రైతులు విత్తన శుద్ధి తర్వాతే ఎద పెట్టుకోవాలని ఏవో వేణుగోపాల్ సూచించారు. పూసపాడులో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు అనిల్, భరత్ పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు మంత్రి పరామర్శ

పంగులూరు, అక్టోబరు 1 : మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం మండలంలో పలువురిని పరామర్శించారు. పంగులూరులో ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకున్న టీడీపీ నేత రాయిణి రామకృష్ణను మంత్రి పరామర్శించారు. అనంతరం ముప్పవరంలో నందిపాటి చందరరావు మృతి చెందగా మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఇదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న కుక్కపల్లి ఆదినారాయణను గొట్టిపాటి పరామర్శించారు. ఆయనతోపాటు బాచిన చెంచుప్రసాద్, రామసుబ్బారావు, టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, కుక్కపల్లి ఏడుకొండలు, స్వామి, జగన్, మేడ సుబ్బారావు, స్థానిక నేతలు ఉన్నారు.

సంతమాగులూరు మండలం కొప్పరం గ్రామానికి చెందిన దివ్యాంగుడు షేక్ రసూల్‌కు మంత్రి గొట్టిపాటి రవికుమార్ మూడు చక్రాల స్కూటర్‌ను అందచేశారు. కార్యక్రమంలో నాయకులు, యువకులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.10వేల సాయం

విజయవాడ వరద బాధితుల సహాయార్థం చందలూరు గ్రామానికి చెందిన పల్లబోతు శ్యామ్‌సుందర్ రూ.10వేల చెక్కును మంగళవారం మంత్రి గొట్టిపాటికి అందచేశారు.

గొర్రెల కాపరి అనుమానాస్పద మృతి

చీరాలటౌన్, అక్టోబరు 1 : చీరాల మండలంలో మంగళవారం గొర్రెల కాపరి మృతి ఉత్కంఠను రేపింది. దీంతో కుటుంబ సభ్యులు, అనుమానితులు హాస్పిటల్ వద్ద స్వల్ప వాగ్వాదానికి దిగారు. వివరాల్లోకి వెళితే.. బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం నర్రావారిపాలెం పంచాయతీ మర్రికట్టువ గ్రామానికి చెందిన మరక ఏసయ్య (40) గొర్రెల కాపరి. ఇతనికి భార్య లక్ష్మి, రామకృష్ణ, జగపతి కుమారులున్నారు. వీరంతా వ్యవసాయ కూలీలు. ఏసయ్య కొంత కాలంగా చీరాల మండల పరిధిలోని గవినివారిపాలెంకు చెందిన నక్కల వెంకటరావు వద్ద గొర్రెల కాపరిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఎనిమిది మందితో కలిసి చీరాల మండలంలోనే కొత్తపాలెంలో గొర్రెలను తోలుకువచ్చారు. సోమవారం రాత్రి అందరితో కలిసి నిద్రించిన ఏసయ్య ఉదయం అందరూ చూసేసరికి శివారు ప్రాంతంలో మనిషి ఎత్తుకూడా లేని జీడి చెట్టుకు వేలాడుతూ శవమై కనిపించాడు. సహచరులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని మంగళవారం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా మృతదేహాన్ని పరిశీలించిన కుటుంబ సభ్యులు మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ముగ్గురు మద్యం విక్రేతల అరెస్టు

ఇంకొల్లు, అక్టోబరు 1 : కొణికిరోడ్డులో లారీ ఆఫీసు సమీపంలో అక్రమంగా మద్యంను విక్రయిస్తున్న ముగ్గురిని ఎస్ఐ సురేష్ అరెస్టు చేశారు. వారి నుంచి 49 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వైన్‌షాపులో పని చేసే మరో ఇద్దరిపై కూడా కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

జూదరుల అరెస్టు

పర్చూరు, అక్టోబరు 1 : పర్చూరు మండల పరిధిలోని చెన్నుంబొట్ల అగ్రహారంలో మంగళవారం ఎస్ఐ మాల్యాద్రి ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1250 నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు పరిశీలన

మార్టూరు, అక్టోబరు 1 : గ్రామాలలో దొంగతనాలను అరికట్టేందుకు, ఆకతాయిల ఆగడాలను నియంత్రించేందుకు సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీసులు ప్రయత్నాలను ప్రారంభించారు. గతంలో మార్టూరు సెంటర్లో దాదాపుగా 12 కు పైగా సీసీ కెమేరాలను ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణ సక్రమంగా లేక అన్నీ మూతపడ్డాయి. దాంతో స్టేషన్ హవుస్ ఆఫీసర్ ఎం.శేషగిరిరావు మండలంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసే దిశగా పోలీసులతో పరిశీలన చేయిస్తున్నారు. గతంలో సీసీల ఏర్పాటుకు కొంతమంది దాతలు స్టేషన్‌కు సహకారం అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీల ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో స్టేషన్ పరిధిలో, మండలంలో ఏఏ ప్రదేశాలలో సీసీలను ఏర్పాటు చేయాలనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. జాతీయ రహదారి కావడం, ప్రధానమైన గ్రానైట్ పరిశ్రమలు ఉండడంతో మార్టూరు సెంటర్లో ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు వేలల్లో నివసిస్తున్నారు. మార్టూరు సెంటర్లో ప్రధానమైన ప్రదేశాలలో సీసీ కెమరాలను ఏర్పాటు చేసేందుకు పోలీసులు కొన్నింటిని గుర్తించారు.


జిల్లా స్థాయి టెస్ట్‌కు ఎంపికైన విద్యార్థులు

చెకుముకిలో ప్రతిభచాటిన విద్యార్థులు

అద్దంకిటౌన్, అక్టోబరు 1 : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ కాకానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ టెస్ట్‌కు సంబంధించిన ప్రశ్న పత్రాలను జెవివి నాయకులు విడుదల చేశారు. మొత్తం 13 పాఠశాలలకు చెందిన టీమ్‌కు ముగ్గురు చొప్పున 16 గ్రూప్‌లలో 48 మంది టెస్ట్‌లో పాల్గొన్నారు. ప్రథమ స్థానంలో సెయింట్ జోసెఫ్ స్కూల్ అద్దంకి, ద్వితీయ స్థానంలో తిమ్మాయపాలెం జెడ్పీహెచ్ఎస్, తృతీయ స్థానంలో శంఖవరప్పాడు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు విజయం సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. ఈ కార్యక్రమంలో హెచ్‌యం గురవయ్య, జెవివి నాయకులు బివి రత్నం, జెవివి బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు, జనరల్ సెక్రెటరీ బి. చంద్రశేఖర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మేదరమెట్ల : మేదరమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి చెకుముకి పోటీలలో మేదరమెట్ల జడ్పీహెచ్ఎస్, రాధాగీతం హైస్కూల్ విద్యార్థులు జిల్లా పోటీలకు అర్హత సాధించారు. మంగళవారం జనవిజ్ఞాన వేదిక నిర్వహించిన పోటీలలో రాధా గీతం స్కూల్‌కు చెందిన సింధుప్రియ, మనో ప్రసన్న, అంజలి, మేదరమెట్ల హైస్కూల్‌కు చెందిన హీయాజ్, జశ్వంత్ సాయికృష్ణ, హస్సేన్ ఎంపిక అయినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఇంకొల్లు : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జన విజ్ఞాన వేదిక, యూటీఎఫ్ వారి ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి ప్రతిభా పరీక్షను నిర్వహించారు. ఉన్నత పాఠశాలల విద్యార్థులు హాజరుకాగా పావులూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు టి.విష్ణువర్ధనరెడ్డి, నాగశ్రీభవ్య, లక్ష్మీప్రణతి ప్రథమ స్థానం సాధించారు. గంగవరం ఎస్‌వీకే ఉన్నత పాఠశాల డి.నాగపద్మజ, శక్తిచరణ్‌తేజ, రాజాప్రతాప్‌రెడ్డి ద్వితీయ స్థానం సాధించారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు ఈనెల 27న జిల్లా స్థాయి పరీక్షలకు హాజరవుతారని యూటీఎఫ్ నాయకులు చెంచయ్య, మస్తాన్‌వలి తెలిపారు.

చినగంజాం : విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకే చెకుముకి పోటీలను నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి కుర్రా రామారావు అన్నారు. మండలంలోని కడవకుదురు జడ్పీ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌ని మంగళవారం నిర్వహించారు. మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ పరీక్ష పత్రాలను కడవకుదురు జడ్పీ పాఠశాలలో రామారావు ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి కడవకుదురు జడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలోను, ప్రైవేటు పాఠశాలల విభాగంలో చినగంజాం సత్యం హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచినట్లు వేదిన మండల కన్వీనర్ ఎస్.నరసింహారావు తెలిపారు. ప్రథమ స్థానంలో నిలిచిన రెండు టీమ్‌ల విద్యార్థులు ఈ నెల 27వ తేదిన జరిగే జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సైన్సు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడల్లో లూథరన్ కళాశాల ప్రతిభ


క్రీడాకారులతో ప్రతినిధులు

చీరాలటౌన్, అక్టోబరు 1 : అథ్లెటిక్స్ జిల్లా స్థాయి అండర్ -19 విభాగంలో సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. డిస్కస్‌త్రోలో కిషోర్ ప్రథమ స్థానం, జావెలిన్ త్రోలో ద్వితీయ స్థానంలో జీవరత్నం, తృతీయ స్థానంలో జీవకుమార్, షాట్‌పుట్‌లో కిషోర్ ప్రథమ, దయాసాగర్ ద్వితీయ స్థానాన్ని సాధించారు. కబడ్డీ ఎంపికలో వెంకటసాయి, రాజు, ఫుట్‌బాల్ విభాగంలో విలియం టిండెల్, నిఖిల్‌రాయ్, సుమంత్, దేవరాజ్ ఎంపికయ్యారు. మంగళవారం కళాశాలలో వారిని అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గారపాటి పుష్పరాజ్ బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

అద్దంకిటౌన్, అక్టోబరు 1 : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపాల్ సాహిల్ బాబు అన్నారు. మంగళవారం అద్దంకిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్వచ్ఛత హి సేవ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణ, తరగతి గదులు శుభ్రం చేయడంతో పాటు ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం కళాశాల నుంచి అభయాంజనేయస్వామి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనరల్ విభాగాధిపతి శ్రీనివాసులు, అధ్యాపకులు రాజ్‌కుమార్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి ప్రవర్తనను అలవర్చుకోవాలి

ఇంకొల్లు, అక్టోబరు 1 : విద్యార్థులు చిన్నతనం నుంచే చెడువ్యసనాలకు అలవాటు కాకుండా మంచి ప్రవర్తన అలవర్చుకోవాలని చీరాల డివిజన్ డిప్యూటీ డీఈవో ఏ.శ్రీనివాసరావు సూచించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రవర్తనా శైలిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇంకొల్లు సీఐ రాఘవయ్య మాట్లాడుతూ బ్యాడ్ టచ్ అండ్ గుడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలగు, డ్రగ్స్‌కు అలవాటు పడితే బంగారు భవిష్యత్ నాశనం అవుతుందన్నారు. మంచి ప్రవర్తనతో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

98.85 శాతం పింఛన్‌ల పంపిణీ


బల్లికురవలో పింఛన్‌లు పంపిణీ చేస్తున్న ప్రత్యేకాధికారి సురేంద్ర


చీరాలలో పింఛన్ అందజేస్తున్న టీడీపీ నేత నాతాని

అద్దంకిటౌన్, అక్టోబరు 1 : ప్రభుత్వ సూచనల మేరకు మండలంలో 1వ తేదినే పింఛన్‌ల పంపిణి ప్రక్రియ దాదాపుగా విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని ఎంపీడీవో ఆర్. దేవసేనకుమారి తెలిపారు. మండలంలోని మణికేశ్వరం గ్రామంలో జరుగుతున్న పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మంగళవారం సాయంత్రానికి మండలంలో 98.85శాతం పూర్తి చేయడం జరిగిందిని, మిగిలిన వాటిని బుధవారం పూర్తి చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టీ డీపీ నాయకులు కరిముల్లా, మీరావలి, ఆశోక్, మౌలాలి, ఆదినారాయణ, అబ్దుల్లా, శి వ , పెద్దన్న , సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బల్లికురవ : మండలంలోని 21 గ్రామ పంచాయతీలలో మంగళవారం ఉదయం నుండే పించన్ల పంపిణీ కార్యక్రమం కొనసాగింది. సచివాలయ ఉద్యోగులకు అందరు గ్రామాలలో ఉన్న పింఛన్ దారుల ఇళ్లకు వెళ్లి వారిని పలకరించి ఎంతో గౌరవంగా వారి చేతుల్లో నాలుగు వేల నగదును పెట్టి ప్రభుత్వం పింఛన్‌ను మీ ఇంటికి పంపించిందని వారికి తెలియజేశారు. మెదటి రోజు మండలంలో మెత్తం 7718 మంది పింఛన్ దారులు ఉండగా గురువారం సాయంత్రానికి 7425 మందికి పింఛన్ సొమ్ము అందజేసి 96 శాతం పంపిణీ పూర్తి చేవారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మండల ప్రత్యేకాధికారి సురేంద్ర, ఎంపీడీవో కుసుమకుమారి, మరియు పంచాయతీ కార్యదర్శులు పరిశీలించారు.

చీరాల : వివిధ రకాల పెన్షన్లు అందుకుంటున్న లబ్ధిదారులు ఆ సొమ్మును సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాతాని ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం ఉదయం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గంలో ఏకకాలంలో పెన్షన్లు పంపిణీ చేపట్టారు. 90 శాతం పైగా పంపిణీ పూర్తయ్యిందని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్‌ల పంపిణీని మంగళవారం ఒక్కరోజే 98 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలో 11,517 పెన్షన్‌లు ఉండగా సాయంత్రానికి 11,292 పూర్తి చేయడంపై హర్షం వ్యక్త చేశారు. అలాగే బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని స్వచ్ఛ భారత్ దివస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

బాలికల రక్షణకు చట్టాలు

బల్లికురవ, అక్టోబరు 1 : బాలికల రక్షణకు పలు చట్టాలు ఉన్నాయని ఎవరికైనా ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా అధికారులకు సమాచారం అందించాలని ఎస్ఐ జీవీ చౌదరి కోరారు. మంగళవారం మండలంలోని చెన్నుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతన్న ఆడపిల్లలతో అయన సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయాలని చూస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు. గ్రామాలలో ఆడపిల్లలను వేధిస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. హెచ్‌ఎం రవి సాగర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

108 వాహనాల తనిఖీలు

చీరాలటౌన్, అక్టోబరు 1 : 108 వాహనాలను నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంచాలని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్.ప్రవీణ్ కుమార్ సూచించారు. మంగళవారం చీరాల, చినగంజాం, ఇంకొల్లు ప్రాంతాల్లో వాహనాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య సాయం కోరిన వారికి 20నిమిషాల వ్యవధిలో అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం సమస్యలను తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా మేనేజర్ బాలకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి


మాట్లాడుతున్న ఆర్డీవో

పంగులూరు, అక్టోబరు 1 : మండలంలో భూసమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి తెలిపారు. పంగులూరు రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం విలే కరులతో మాట్లాడుతూ చందలూరు, తూర్పు తక్కెళ్లపాడు గ్రామలలో రెవెన్యూ సమస్యలు గుర్తించి పరిష్కార చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. చందలూరు గ్రామంలో సర్వే నెంబరు 737లో 28 ఎకరాల 62 సెం ట్ల గ్రామ కంఠం ఉందన్నారు. ఈ భూమిలోనే గ్రామం మొత్తం ఉందని, గ్రామానికి చెందిన మూడు దేవాలయాలకు సంబంధించిన 17 సెంట్లు ఉన్నట్లు తెలిపారు. దానిని సబ్‌డివిజన్ చేయని కారణంగా భూముల క్రయవిక్రయాలు నిలిచిపోయినట్లు చెప్పారు. సమస్యను పరిష్క రించేందుకే రెవెన్యూ సిబ్బంది చర్యలు చేపట్టారని తెలిపారు. తూర్పు తక్కెళ్లపాడు గ్రామంలో 57 మంది రైతులకు చెందిన సమస్యను కూడా పరిష్కరించాలని ఆర్డీవో అధికారులకు సూచించారు. సమావేశంలో తహసీల్దార్ నాగరాజారావు పాల్గొన్నారు.

పండుటాకులకు గుర్తొచ్చిన బాల్యం

» ఆటల పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్న వృద్ధులు
» విజేతలకు బహుమతులు అందజేసిన మాజీ మంత్రి లక్ష్మీ పద్మావతి


మ్యూజికల్ చైర్ ఆటలో వృద్ధ మహిళలు

చీరాల, అక్టోబరు 1 : వారంతా పండుటాకులు. మహిళా మండలి వృద్ధాశ్రమంలో ఉంటున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా ఒకే కుటుంబంగా ఉంటారు. ఈ నేపథ్యంలో స్థానిక మహిళా మండలి ప్రాంగణంలో మంగళవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా వృద్ధులకు ఆటల పోటీలను నిర్వహించారు. దీంతో వారంతా చిన్నపిల్లలు అయిపోయారు. బాధలను మరిచారు. ఒంటరి వాళ్లమనే భావన మరిచారు. ముసలితనం శరీరానికే. మనస్సుకు కాదు. బాల్యం గుర్తొంచిదంటూ ఆ వృద్ధులు ఎంతో ఉత్సాహంలో ఆటల పోటీలలో పాల్గొన్నారు. మ్యూజికల్ చైర్‌లో బి. సీతమ్మ, ఎ. మెరిల్ల, లెమన్ అండ్ స్పూన్ గేమ్‌లో ఎం.జానకమ్మ, త్రోబాల్‌లో కె.ఇంద్రాణి, ఈ.పార్వతి, డి.రమణమ్మ, పాటల పోటీలో ఏ. కోటేశ్వరమ్మ, ఇ.పార్వతి గెలుపొందారు. గెలిచిన వారిని క్రీడా స్ఫూర్తితో తోటివారు అభినందించారు. గెలుపొందిన వారికి మాజీ మంత్రి జాగర్లమూడి లక్ష్మీపద్మావతి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆర్. శ్రీనివాసరెడ్డి, సోషల్ వర్కర్ పుష్ప, ఫ్యామిలీ కౌన్సిలర్ సంధ్య, అంజలి, దానమ్మ తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న మాజీ మంత్రి లక్ష్మీపద్మావతి

ఘనంగా వృద్ధుల దినోత్సవం

చినగంజాం : చుండి బజారులోని వాల్మీకి సేవా సంఘంలో 34వ ప్రపంచవృద్ధుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వృద్ధుల దినోత్సవం సందర్భంగా వాల్మీకి సేవా సంఘంలోని వృద్ధులకు క్యారమ్స్, చెస్, వైకుంఠపాళీ, మ్యూజికల్ చైర్స్, లెమన్‌స్పూన్ తదితర ఆటల పోటీలను నిర్వహించినట్లు సేవా సంఘం సూపర్‌వైజర్ గాజుల సోమయ్య తెలిపారు.

ఈ సందర్భంగా భారత్ నిర్మాణ్ వలంటీర్ గోవిందస్వామి మాట్లాడుతూ తల్లిదండ్రులకు, బిడ్డలకు అనుబంధం దూరమైందన్నారు. వృద్ధుల పట్ల ప్రతి ఒక్కరు గౌరవంగా ఉండాలని అన్నారు. విజేతలకు కొత్తపాలెం గ్రామ సర్పంచ్ ఆసోది బ్రహ్మారెడ్డి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నటరాజ్, సాయి, వాల్మీకి సేవా సంఘం సిబ్బంది, వృద్ధులు, పాల్గొన్నారు.